విశాలాంధ్ర
తిరుపతి జిల్లా
చిత్తూరు జిల్లా
ఆదివారం 2 జూన్ 2024 8పేజీలు

'కౌంటింగ్'కు
పకడ్బందీ ఏర్పాట్లు

- 4న ఉదయం 8గంటల నుంచి ఓట్ల లెక్కింపు
- తొలి ఫలితం మధ్యాహ్నం 3.30గంటలకు
- చంద్రగిరికి 20 టేబుళ్లు... మిగిలిన వాటికి 14
- పోస్టల్ బ్యాలెట్లు 22,795
- కలెక్టర్ ప్రవీణ్ కుమార్

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి శ్రీ పద్మావతి మహిళా విశ్వ విద్యాలయ ప్రాంగణంలోని ఇంజనీరింగ్ కళాశాలలో ఓట్ల లెక్కింపు కోసం పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు కలెక్టరు ప్రవీణ్ కుమార్ తెలిపారు. తిరుపతి కలెక్టరేట్ లో శనివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల కమిషను ఆదేశాల మేరకు ఈ నెల 4వ తేదీ మంగళవారం ఉదయం 7గంటలకు అభ్యర్థుల సమక్షంలో రిటర్నింగ్ అధికారులు ఈవీఎంలు బయటకు తీస్తారన్నారు. 8గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభమవుతుందన్నారు. తొలి ఫలితం మధ్యాహ్నం 3.30గంటలకు వెలువడే అవకాశం ఉందని ప్రవీణ్ కుమార్ అభిప్రాయపడ్డారు. చంద్రగిరిలో పోలింగ్ స్టేషన్లు అధికంగా ఉన్నందున 20 టేబుళ్లు ఏర్పాటు చేస్తామన్నారు. గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి, తిరుపతి, శ్రీకాళహస్తి, సత్యవేడు నియోజకవర్గాల ఓట్ల లెక్కింపు కోసం 14 టేబుళ్ల వంతున ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. గూడూరు 21, సూళ్లూరుపేట 22, వెంకటగిరి 22, తిరుపతి 20, శ్రీకాళహస్తి 21, సత్యవేడు 20, చంద్రిగిరి 20 రౌండ్ల వంతున ఓట్లు లెక్కిస్తామన్నారు. తిరుపతి, సత్యవేడు, చంద్రగిరి ఫలితాలు మధ్యాహ్నం 3.30గంటలకు... గూడూరు, శ్రీకాళహస్తి 3.50గంటలకు... సూళ్లూరుపేట, వెంకటగిరి సాయంత్రం 4.10గంటలకు ఫలితాలు వెలువడే అవకాశం ఉందన్నారు. మొదటి రెండు రౌండ్లుకు 30 నిమిషాలు వంతున... మిగిలిన రౌండ్లకు 20 నిమిషాలు వంతున సమయం పడుతుందని కలెక్టరు తెలిపారు. ఉదయం 8గంటలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు ప్రారంభం అవుతుందని... 8.30గంటల నుంచి ఈవీఎం ఓట్లు లెక్కిస్తామన్నారు. ప్రతి టేబుల్ కు ఒక ఏఆర్వో, కౌంటింగ్ సూపర్ వైజరు, కౌంటింగ్ అసిస్టెంటు, మైక్రో అబ్జర్వరు, నాలుగవ తరగతి ఉద్యోగి ఒక్కొక్కరు వంతున ఉంటారన్నారు. తిరుపతి పార్లమెం టుకు సంబంధించి 19,503మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని... వీటిని 14 టేబుళ్ల ద్వారా మూడు రౌండ్లలో లెక్కింపు పూర్తి చేస్తామన్నారు. ఏడు శాసనసభ స్థానాలకు సంబంధించి మొత్తం 22,795మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారన్నారు. గూడూరులో 2,836మంది, సూళ్లూరుపేటలో 2,286మంది, వెంకటగిరిలో 2,891మంది, తిరుపతిలో 4,766 మంది, శ్రీకాళహస్తిలో 3,052మంది, సత్యవేడులో 1,777మంది, చంద్రగిరిలో 5,187మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగించుకున్నారని కలెక్టరు ప్రవీణ్ కుమార్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్లు లెక్కింపు చంద్రగిరిలో మూడు రౌండ్లు, మిగిలిని ఆరు నియోజకవర్గాల్లో రెండు రౌండ్లలో పూర్తి చేస్తామన్నారు. తిరుపతి కేంద్రంలో

2లో

ఎన్నికల కౌంటింగ్ కేంద్రం వద్ద

కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు

- జిల్లా ఎస్పీ మణికంఠ చందోల్

విశాలాంధ్ర -చిత్తూరు : సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద కట్టదుట్టమైన భద్రతా ఏర్పాటు చేయాలని జిల్లా ఎస్పీ మణికంత చందోల్ పోలీసు అధికారులను ఆదేశిం చారు.సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ నేపథ్యంలో జిల్లా లోని చిత్తూరు సబ్ డివిజన్ పోలీసులతో పోలీస్ గెస్ట్ హౌస్ నందు గల కాన్ఫరెన్స్ హాల్లో సమావేశం నిర్వహి ంచిన అనంతరం పలమనేరు, కుప్పం నగరి సబ్ డివిజన్ పోలీసు అధికారులతో జిల్లాఎస్పీ వి.ఎన్. మణికంతచందోలు, జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షా సమావేశం నిర్వహించారు.

2

ఎట్టి పరిస్థితుల్లోనూ హింసను ఉపేక్షించేది లేదు

-ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యం
- ఓట్ల లెక్కింపు వేళ... విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదు
- జిల్లాలో 144 సెక్షన్ అమల్లో ఉంది
- బాణాసంచా విక్రయం, పేల్చడం నిషేధం
- కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్
- కౌంటింగ్ కు పటిష్టమైన భద్రత చర్యలు చేపడుతున్నాం
- ఎస్పీ హర్ష వర్ధన్ రాజు

2లో

తిరుమలలో వేడుకగా...
హనుమజ్జయంతి ఉత్సవాలు

ఆకాశగంగా శ్రీ బాలాంజనేయస్వామి ఆలయంలో శాస్త్రోక్తంగా సుమల్లికార్చన

జపాలి తీర్థంలోని శ్రీ ఆంజనేయస్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించిన టీటీడీ ఈవో

వార్త 2లో

తిరుమలలో వేడుకగా...

హనుమజ్జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర – తిరుమల : తిరుమలలో హనుమజ్జయంతి ఉత్సవాలు శనివారం వేడుకగా ప్రారంభమయ్యాయి.శ్రీ ఆంజనేయస్వామి జన్మ స్థలమైన ఆకాశగంగలో వందల సంవత్సరాల క్రితం నుండి శ్రీ అంజనాదేవి సమేత శ్రీ బాలాంజనేయస్వామివారు వెలసి ఉన్నారని, హనుమత్ జయంతి సందర్భంగా విశేష అభిషేక పూజ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. ముందుగా ఆకాశగంగలో శ్రీ అంజనాదేవి, శ్రీ బాలాంజనేయస్వామివారికి శ్రీవారి ఆలయం నుండి విశేషమైన శేష వస్త్రాలు ఈవో ఎవి.ధర్మారెడ్డి సమర్పించారు. హనుమంతుని జన్మ విశేషాలతో ప్రారంభమై, ఉపచారాలు, పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహించారు. లోక క్షేమం కొరకు స్వామివారికి ఎంతో ప్రీతిపాత్రమైన మల్లెలతో సహస్రనామ అర్చన నిర్వహించారు.జపాలి తీర్థంలో...జపాలి తీర్థంలోని శ్రీ ఆంజనేయస్వామివారికి ఈవో పట్టువస్త్రాలు సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం జపాలి తీర్థం వద్ద ఈవో మీడియాతో మాట్లాడుతూ, హనుమంతుల వారు అంజనాదేవి తపోఫలితంగా వాయుదేవుని వరప్రసాదంతో అంజనాద్రిలో జన్మించారని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. హనుమజ్జయంతి సందర్భంగా హనుమ జన్మస్థానమైన ఆకాశగంగ తీర్థంలోని శ్రీ బాలంజనేయస్వామివారికి ఐదు రోజుల పాటు అభిషేకం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. అదేవిధంగా నాదనీరాజనం వేదిక, ఆకాశగంగ, జపాలి ప్రాంతాల్లో ధార్మికోపన్యా సాలు, భక్తి సంగీత కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు.జూన్ 2వ తేదీ ఆదివారం ధర్మగిరి వేదపాఠశాలలో సంపూర్ణ సుందరకాండ అఖండ పారాయణం జరుగనుందని, హనుమంతుడు సీతాన్వేషణ కోసం లంకకు వెళ్లి సీతమ్మ జాడ తెలుసుకుని శ్రీరామచంద్రునికి తెలియేజేసే పూర్తి ఘట్టంలోని 2823 శ్లోకాలను పండితులు పారాయణం చేస్తారని చెప్పారు. హనుమంతుడు ఎలా అయితే విశ్రాంతి లేకుండా రామకార్యం కోసం వెళ్లారో అదేవిధంగా పండితులు నిరంతరాయంగా 18 గంటల పాటు పారాయణం చేస్తారని తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న భక్తుల కోసం ఈ మొత్తం కార్యక్రమాన్ని ఎస్వీబీసీ ప్రత్యక్ష ప్రసారం చేస్తుందన్నారు.జాపాలి మహర్షి త్రేతాయుగంలో ఆకాశగంగలో తపస్సు చేయడంతో హనుమంతుడు ప్రత్యక్షమై వరాలిచ్చారని, అనంతరం ఇక్కడి జాపాలి తీర్థంలో హనుమంతుని విగ్రహాన్ని మహర్షి ప్రతిష్టించారని పురాణాల ద్వారా తెలుస్తోందన్నారు. ఇక్కడి స్వామివారిని, స్వామివారి జన్మస్థలమైన ఆకాశగంగలో మాతృమూర్తి శ్రీ అంజనాదేవి సమేత శ్రీ బాలాంజనేయస్వామిని భక్తులు దర్శించుకుని స్వామివారి కృపకు పాత్రులు కావాలని కోరారు.జపాలిలో మాల్ పూరి ప్రసాదంరాష్ట్ర దేవాదాయ శాఖ కమీషనర్ ఆదేశాల మేరకు జపాలి శ్రీ ఆంజనేయస్వామివారి ఆలయంలో మొదటి సారిగా మాల్ పూరి ప్రసాదాన్ని విక్రయిస్తున్నట్లు హథీరాంజీ మఠం పరిపాలన అధికారి రమేష్ తెలిపారు. హనుమత్ జయంతిని సందర్భంగా శనివారం నుండి ప్రతి రోజు భక్తులకు విక్రయిస్తామన్నారు. రూ.20 విలువ గల ఈ మాల్ పూరి ప్రసాదం ఎంతో ఎంతో రుచికరంగా ఉందని, భక్తుల నుండి విశేష స్పందన వస్తోందని ఆయన చెప్పరు. శ్రీ బేడి ఆంజనేయస్వామి ఆలయంలో. .శ్రీవారి ఆలయానికి ఎదురుగానున్న శ్రీ బేడి ఆంజనేయస్వామివారి ఆలయంలో ఉదయం ప్రత్యేక పూజలు, అభిషేకం నిర్వహించారు. మొదటి ఘాట్‌రోడ్డులోని ఏడవమైలు వద్ద ఉన్న శ్రీ ప్రసన్న ఆంజనేయస్వామి నిలువెత్తు విగ్రహానికి మధ్యాహ్నం ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు.ఈ కార్యక్రమాల్లో హథీరాంజీ మఠం మహంతు ఓం ప్రకాష్ దాస్‌జి, వైఖానస ఆగమసలహాదారు మోహనరంగాచార్యులు, ఫార్‌పతేధార్ తులసీ ప్రసాద్, డెప్యూటీ ఈవోలు లోకనాథం, సెల్వం, ధర్మగిరి వేద విజ్ఞన పీఠం పండితులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

పకడ్బందీ ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి) ఓట్ల లెక్కింపు కోసం ఒక డీఈవో (జిల్లా ఎన్నికల అధికారి), నలుగురు పరిశీలకులు, రిటర్నింగ్ అధికారులు ఏడు మంది, ఏఆర్వోలు, కౌంటింగ్ సూపర్ వైజర్లు, కౌంటింగ్ అసిస్టెంట్లు, మైక్రో అబ్జర్వర్లు, నాలుగవ తరగతి ఉద్యోగులు కలిపి మొత్తం 1,181 మంది, సపోర్టింగ్ స్టాఫ్ 1,050మంది విధుల్లో ఉంటారని కలెక్టరు తెలిపారు. కౌంటింగ్ కోసం 431మంది ఏజెంట్లు దరఖాస్తు చేసుకున్నారని ఆయన తెలిపారు. కౌంటింగ్ కేంద్రంలో వరుసగా గుర్తింపు పొందిన జాతీయ పార్టీలు, రాష్ట్ర పార్టీలు, ఇతర రాష్ట్ర పార్టీలు, గుర్తింపు పొందని రిజిస్టరు పార్టీలు, స్వతంత్ర అభ్యర్థుల ఏజెంట్లకు స్థానం కల్పిస్తామన్నారు. ఇందుకు వారు సహకరించాలని కలెక్టరు విజ్ఞప్తి చేశారు. ఏజెంట్లు కౌంటింగ్ రోజున ఉదయం 7గంటలకు ఓట్ల లెక్కింపు కేంద్రానికి చేరుకోవాలని ఆయన సూచించారు. ఓట్ల లెక్కింపు కేంద్రం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు కలెక్టరు తెలిపారు. ఈ కేంద్రం వద్ద 164 సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం 144వ సెక్షన్ అమలు చేస్తున్నామన్నారు. కౌంటింగ్ కేంద్రాల్లోకి మొబైల్ ఫోన్ అనుమతించమన్నారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీసులతో పాటు ఇద్దరు ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్లను అందుబాటులో ఉంచుతున్నామన్నారు. అదేవిధంగా కౌంటింగ్ కేంద్రం వద్ద వైద్య సిబ్బందిని, అగ్నిమాపక సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లు కలెక్టరు ప్రవీణ్ కుమార్ తెలిపారు. ఓట్ల లెక్కింపు ప్రక్రియ ప్రశాంతంగా జరగడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కలెక్టరు విజప్తి చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చట్ట పరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు

(మొదటి పేజీ తరువాయి) ఈ సందర్భంగాఎస్పీ మాట్లాడుతూ వారి పరిధిలో గల రౌడీ షీటర్ల సమీక్ష చేయాలని, వారి ప్రస్తుత ప్రదేశాలు, ఇటీవల తెరిచిన రౌడీ షీట్లు కౌన్సిలింగ్ స్థితిని అడిగి తెలుసుకున్నారు. కౌంటింగ్ రోజున ఎటువంటి అలజడలు లేకుండా చూడాలని తెలిపారు. వారు తమ క్రిమినల్ కార్యకలాపాలను మానుకొని, మంచి జీవితం గడిపే విధంగా కౌన్సెలింగ్ ఇవ్వాలని సూచించారు. కౌంటింగ్ రోజుకు పూర్తి సన్నద్ధతలో ఉండాలని తెలిపారు. ఉల్లంఘనలు విభిన్న రౌడీ షీటర్ల పై ఇంకా పెండింగ్ లో ఉన్న అరెస్టులు కేసులు కూడా పర్యవేక్షించాలని వాటి పై తీసుకున్న చర్యల గురించి రేపటిలోపు నివేదిక అందించాలని తెలిపారు. సమస్యాత్మక గ్రామాలు ట్రబుల్ మాంగర్స్ జాబితాను సేకరించి వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలి. సమస్యాత్మక ప్రదేశాలలో అవసరమైతే పికెట్లు ఏర్పాటుచేయాలి, అదనపు బలగాలను వినియోగించుకోవాలి. రూట్ మ్యాప్స్ ను భద్రతా ప్రణాళికలు సిద్ధం చేసుకుంటే అవాంచనీయ ఘటనల సమయంలో ఉపయోగంగా ఉంటుంది. ముఖ్య నేతల ఇళ్ళు పార్టీ కార్యాలయాల్లో సీసీటీవీ కెమెరాలు ఏర్పాటు చేయించాలని ఇవి నిరంతరం పర్యవేక్షణలో ఉండేలా సరిపడ సిబ్బందిని కేటాయించాలన్నారు.. అల్లర్ల నియంత్రణ కోసం అవసరమైన అన్ని పరికరాలు సిద్ధంగా ఉంచుకోవాలని చెప్పారు. రబ్బరు బుల్లెట్లు, టియర్ గ్యాస్, ఇతర పరికరాలు అందుబాటులో ఉంటాయని. నిర్దిష్ట లక్ష్యాలను దృష్టిలో ఉంచుకొని కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టాలి. ప్రతి ప్రాంతం మరియు ఇళ్ళను క్షుణ్ణంగా పరిశీలించి, సాయుధ బలగాల సహకారంతో అనుమానాస్పద వ్యక్తులను గుర్తించి, వారిని విచారించాలి. సరైన పత్రాలు లేని వస్తువులను గుర్తించి తగిన చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితులు ఎదురైనప్పుడు వెంటనే చర్యలు తీసుకోవడం కోసం ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలన్నారు. అవసరమైతే అదనపు బలగాలను వినియోగించుకోవాలి. పటిష్టమైన నియమ నిబంధనలు పాటిస్తూ, ప్రజల హక్కులను కాపాడే విధంగా చర్యలు తీసుకోవాలని సమస్యాత్మక ప్రాంతాలలో శాంతి భద్రతల ఏర్పాట్ల కోసం ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తూ స్థానిక ప్రజలకు భద్రతా భరోసా కల్పించాలని, ఫ్లాగ్ మార్చ్ నిర్వహించే సమయంలో ప్రజలతో సాన్నిహిత్యం పెంచి, వారి సమస్యలను వినడం పరిష్కరించడం ప్రధాన కర్తవ్యమని ఎస్పీ ఆదేశాలు జారి చేసారు.ఈ సమావేశంలో అడిషనల్ ఎస్పీ అడ్మిన్ ఎస్.ఆరిఫుల్లా, ట్రైనింగ్ డి.ఎస్పీ పావన్ కుమార్, సబ్ డివిజన్ డి.ఎస్పీ లు, ఇన్స్పెక్టర్ లు, ఎస్.ఐ.లు పాల్గొన్నారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ హింసను ఉపేక్షించేది లేదు

విశాలాంధ్ర – తిరుపతి : జూన్ 04వ తేదీన జిల్లాలో భారత ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరుగుతుందని, ఈ మేరకు జిల్లా యంత్రాంగం తరఫున శ్రీపద్మావతి మహిళా విశ్వ విద్యాలయాల ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన లెక్కింపు కేంద్రాల్లో పటిష్ట ఏర్పాట్లు చేశామని, ఆ రోజున ఎలాంటి హింసాత్మక ఘటనలకు తావు ఉండరాదనీ, ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదనీ, ఓట్ల లెక్కింపు వేళ విజయోత్సవ ర్యాలీలు, ఊరేగింపులు నిర్వహించరాదనీ, జిల్లాలో అమల్లో 144 సెక్షన్ అమలు ఉందని, బాణాసంచా విక్రయం, పేల్చడం నిషేధం అని, ప్రశాంత వాతావరణం లో ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియను విజయవంతంగా నిర్వహించడమే ప్రధాన లక్ష్యమని కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి ప్రవీణ్ కుమార్ పేర్కొన్నారు.శనివారం ఉదయం స్థానిక కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నందు రిటర్నింగ్ అధికారులు, పోలీస్ అధికారులతో సంయుక్తంగా జూన్4 న కౌంటింగ్ నేపథ్యంలో శాంతిభద్రతలపై కలెక్టర్ మరియు జిల్లా ఎన్నికల అధికారి వారు జిల్లా ఎస్పీ హర్ష వర్ధన్ రాజు, పోలీస్ ప్రత్యేక అధికారి సరిత లతో కలిసి సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జూన్4 న ఎన్నికల ఓట్ల లెక్కింపు మరియు ఫలితాల వెల్లడి నేపథ్యంలో జిల్లాలో శాంతిభద్రతలు పక్కాగా అమలు పరిచే దిశలో జిల్లాలో సెక్షన్ 144 అమలులో ఉందని, పోలీస్ శాఖ శాంతి భద్రతలకు పలు చర్యలు చేపట్టిందని తెలిపారు. పోలింగ్ సమయంలో మరియు పోలింగ్ తర్వాత జరిగిన హింసాత్మక ఘటనల నేపథ్యంలో పోలీసుశాఖ పలు చర్యలు చేపట్టిందని పలు గ్రామాల్లో పోలీస్ పికెట్ లు ఏర్పాటు చేయడం జరిగిందని, క్యూ ఆర్ టి మొబైల్ టీం లు ఏర్పాటు చేశారని, అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ శాంతి భద్రతలకు విఘాతం కలగరాదని హెచ్చరించారు. రోడ్లు, బహిరంగ ప్రదేశాలలో బాణసంచా పేల్చడం, కాల్చడం పూర్తిగా నిషేధం అని పేర్కొన్నారు. విజయోత్సవ ర్యాలీలు విజేతలు గానీ, వారి అనుచరులు గానీ, ఊరేగింపులు నిర్వహించడానికి వీలులేదని స్పష్టం చేశారు. పార్లమెంటు, శాసన సభకు జరిగిన సాధారణ ఎన్నికలు -2024 నేపథ్యంలో జూన్ 04వ తేదీన లెక్కింపు ప్రక్రియను శాంతియుతంగా నిర్వహించేందుకు, సంఘ విద్రోహ శక్తుల జోక్యాన్ని అరికట్టడానికి, శాంతి భద్రతలను కాపాడేందుకు అనుగుణంగా జిల్లాలో 144 సెక్షన్ విధించినట్లు పేర్కొన్నారు. పోలీసు అధికారులు ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల మేరకు శాంతిభద్రతల పరిరక్షణలో నిష్పాక్షికంగా వ్యవహరించాలని సూచించారు. ఎవరైనా న్యూసెన్స్ మరియు సమస్యలను ఉత్పన్నం చేసే వారు ఉంటే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. సాయంత్రం పైన ఎగ్జిట్ పోల్స్ వెలువడనున్న నేపథ్యంలో జిల్లాలో ఎలాంటి హింసాత్మక సంఘటనలు చోటు చేసుకోకుండా తగిన బందోబస్తు, మొబైల్ టీంలు క్యూఆర్టి, నిఘా ఉండాలని తెలిపారు. ప్రజలలో భరోసా కల్పిస్తూ ఫ్లాగ్ మార్చ్ లు నిర్వహించి, కార్డన్ సర్చ్ చేపట్టడం ఎస్పీ గారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని, కొనసాగించాలని అన్నారు. స్ట్రాంగ్ రూమ్ వెనుక వైపు మరింత భద్రత కట్టుదిట్టం చేశామని, ఈవీఎంలు భద్రతలో ఎటువంటి అనుమానం అవసరం లేదని తెలిపారు. రిటర్నింగ్ అధికారి కౌంటింగ్ హాల్లో జరిగే కౌంటింగ్ ప్రక్రియకు పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని పూర్తి అప్రమత్తంగా పనిచేయాల్సి ఉంటుందని తెలిపారు. రిటర్నింగ్ అధికారి నిర్ణయం తుది నిర్ణయంగా ఉంటుందని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల మరియు 7 అసెంబ్లీ నియోజకవర్గ పిసి మరియు పోస్టల్ బ్యాలెట్ రెండు మొత్తం కలిపి 16 కౌంటింగ్ హాల్ నందు జరిగే ప్రతిది సీసీటీవీ కెమెరా నందు రికార్డ్ అవుతుందని, అభ్యర్థులు లేదా వారి ఏజెంట్లు ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా వారి మార్గదర్శకాల మేరకు నడుచుకోవాలని ఎలాంటి గొడవలకు తావివ్వరాదని లేనిచో సదరు కౌంటింగ్ కేంద్రం వద్ద పోలీస్ ఏర్పాటు ఉంటుందని వారు వారికి సంబంధించిన పోలీస్ సిబ్బంది టీమ్ తో తగు చర్యలు చేపట్టాల్సి ఉంటుందని సూచించారు. కౌంటింగ్ ఒకసారి ప్రారంభమైన తర్వాత ఎట్టి పరిస్థితుల్లోనూ ఫలితాలు వెల్లడయ్యేవరకు ప్రక్రియ ఆగరాదని తెలిపారు. మీడియా కేంద్రం ఏర్పాటు చేశామని, అందు కొరకు కౌంటింగ్ అథారిటీ లెటర్లు ఉన్నవారిని ఓబి వ్యాన్ లను గేట్ వన్ నుండి అనుమతించాల్సి ఉంటుంది సూచించారు. జిల్లా ఎన్నికల అధికారి, సంబంధిత రిటర్నింగ్ అధికారి జారీ చేసిన చెల్లుబాటు అయ్యే ఐడీ పాస్ ఉన్న వ్యక్తులు మాత్రమే ప్రాంగణంలోకి ప్రవేశించడానికి అనుమతి ఉంటుందని, కౌంటింగ్ కేంద్రం లోపలకు అభ్యర్థులు, ఏజెంట్లు, సిబ్బందికి మొబైల్ ఫోన్ తీసుకెళ్లడానికి వీలులేదని తెలిపారు. కౌంటింగ్ ప్రాంగణంలోకి వాహనాలకు అనుమతి లేదని తెలిపారు.ఎస్పీ మాట్లాడుతూ బందోబస్తు కొరకు విస్తృతమైన ఏర్పాట్లు చేపట్టామని, తగినన్ని క్యూఆర్టీలు ఏర్పాటు, పోలీస్ పికెట్లు ఏర్పాటు చేశామని వివరించారు. సిఏపీఎఫ్ కంపెనీలు తగినన్ని అందుబాటులో ఉన్నాయని రెండు ప్లాటూన్ల రాష్ట్ర సాయుధ బలగాలు అందుబాటులో ఉన్నాయని, ఓట్ల లెక్కింపు సందర్భంగా జిల్లాలో 3,000 మంది పోలీసు, కేంద్ర సాయుధ బలగాలతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేపట్టామని తెలిపారు. కౌంటింగ్ కేంద్రం పరిధిలో డ్రోన్ ఫ్లయింగ్ నిషేధం అని తెలిపారు. చంద్రగిరి తిరుపతి నియోజకవర్గాలలో మరింత బందోబస్తు విస్తృత స్థాయిలో ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. వెంకటగిరి రిటర్నింగ్ అధికారి మరియు జెసి ధ్యాన చంద్ర మాట్లాడుతూ ఉదయం నుండే పలు సిబ్బంది ఏజెంట్లు అభ్యర్థులు రానున్న నేపథ్యంలో తగినన్ని చెకింగ్ పాయింట్లు ఏర్పాటు చేసి ఆలస్యం కాకుండా చూడాలని సకాలంలో సిబ్బంది, జనరల్ ఏజెంట్లు కౌంటింగ్ కేంద్రంలో చేరుకునేలా ఏర్పాటు ఉండాలని పోలీస్ అధికారులకు సూచించారు.

ఏపీ మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

– ప్రిన్సిపల్ డాక్టర్ రమ

విశాలాంధ్ర - పుంగనూరు: ఏపీ మోడల్ స్కూల్ 7 8 9 తరగతుల ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ డాక్టర్ రమ కోరడం జరిగింది ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏపీ మోడల్ స్కూల్ 7 8 9 తరగతుల ప్రవేశం కొరకు పరీక్ష ద్వారా విద్యార్థులను చేర్చుకోవడం జరుగుతుందని అందుకోసం జూన్ ఐదో తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు గౌరవనీయులైన ఏపీ మోడల్ స్కూల్ జాయింట్ డైరెక్టర్ ఆదేశాల మేరకు పాఠశాల నందు ఆరో తేదీన ఉదయం 10 నుంచి 12:00 వరకు పరీక్ష నిర్వహించడం జరుగుతుందన్నారు. కామన్ క్వశ్చన్ పేపర్ ప్రతి విద్యార్థికి ఇవ్వడం జరుగుతుందన్నారు విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఈ అవకాశాన్ని సద్వినియం చేసుకోవాలని కోరుతున్నామన్నారు పరీక్ష సమయానికి ముందే ఒక గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని కోరుతున్నామన్నారు 7 8 9 తరగతులకు సిబిఎస్ సిలబస్ బోధించబడునని కాబట్టి పరీక్ష రాసేటటువంటి విద్యార్థులు బాగా చదువుకొని ప్రవేశ పరీక్షకు రావాలన్నారు పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులను జూన్ 8వ తేదీ నుండి పాఠశాల నందు చేర్చుకోవడం జరుగుతుందన్నారు.

ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి భూమిపూజ

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండలం తంగేళ్లపాళెంలో అభయ ఆంజనేయ స్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడు శనివారం భూమి పూజ చేశారు. కొబ్బరికాయ కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్సీవీనాయుడు మాట్లాడుతూ... తన సొంత గ్రామమైన తంగేళ్లపాళెంలో అభయ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి శ్రీకారం చుట్టడం ఆనందంగా ఉందన్నారు. వాయులింగేశ్వరుని మరొక అవతారమే ఆంజనేయ స్వామి అన్నారు. వాయులింగేశ్వరుని ఆశీస్సులతో తాము తలపెట్టిన అభయ ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం ఎటువంటి ఆటంకం లేకుండా పూర్తి అవ్వాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో తంగేళ్లపాలెం సర్పంచ్ ఎస్సీవీ చెంచు కృష్ణమ నాయుడు, ఎస్సీవీ కిరణ్ కుమార్ నాయుడు, గుడ్లూరు మోహన్ కిషోర్ నాయుడు, హరి, సుధాకర్ నాయుడు, చంద్రబాబు, వినోద్ నాయుడు, వెంకటాద్రి నాయుడు, రామకృష్ణమ నాయుడు, సుదర్శన్ నాయుడు, చరణ్ తేజ్ నాయుడు, తంగేళ్ల పాలెం గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

హనుమంతునికి లక్ష తమలపాకుల పూజ

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : తిరుపతి జిల్లా సూళ్లూరుపేట లో వెలసి ఉన్న శ్రీ బాలాంజనేయ స్వామి ఆలయం లో శనివారం నుండి హనుమాన్ జయంతి ఉత్సవాలను అంగరంగ వైభవముగా ప్రారంభించారు,ఈ వేడుకల్లో భాగంగా మొదటి రోజు హనుమంతునికి ప్రత్యేక అభిషేకాలు చేసి హారతులిచ్చారు,ఆలయ అవరణం లో హనుమంతుని ఉత్సవ మూర్తికి ప్రత్యేక అలంకారం చేసి వేదపండితుల నేతృత్వం లో భక్తుల చేత లక్ష తమలపాకుల అర్చన పూజలు ఘనంగా నిర్వహించారు,ఆలయ ప్రధాన అర్చకులు దీవి లక్ష్మీనారాయణ అద్వర్యం లో మమతా పర్యవేక్షణ లో జరుగుతున్నా ఈ ఉత్సవాల నిర్వహణకు ఐతా శ్రీధర్ ,కాకిశ్రీరామమూర్తి , భగవదాస్ ,మదరపాక సురేష్,ఎర్రప్పరెడ్డి బాబురెడ్డి,నింద్ర రాజేంద్ర ప్రసాద్,సోమిశెట్టి వెంకటసుబ్బయ్య,పోలూరు శ్రీధర్ సహాయ సహకారాలను అందజేస్తున్నారు.

వైభవంగా అనుమతి జయంతి వేడుకలు

– సీతారాముల కళ్యాణం ఉత్సవాలు



విశాలాంధ్ర - పెద్దపంజాణి : మండలంలో శనివారం హనుమాన్ జయంతి సందర్భంగా ఆంజనేయస్వామి ఆలయాల్లో ఘనంగా అభిషేకాలు అర్చనలతో భక్తులు భక్తులు స్వామివారిని దర్శించుకుని కొబ్బరికాయలు కొట్టి మంగళహారతులతో మొక్కులు తీర్చుకు న్నారుకన్నుల పండుగగా శ్రీ సీతారాముల వారి కల్యాణోత్సవందిన్నెపల్లె సమీపంలోని శ్రీ ఆంజనేయ స్వామి ఆలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా శ్రీ సీతారాముల వారి కళ్యాణ మహోత్సవం గ్రామస్తులు భక్తులు ఘనంగా నిర్వహించారు ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద ఎత్తున స్వామివారి కల్యాణోత్సవాన్ని దర్శించుకున్నారు భారీ ఎత్తున అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు అనంతరం రామకోటి రాత్రికి కోలాటం చెక్కభజనలతో అంగరంగ వైభవంగా జరిపించారు.

భానుడి ప్రతాపంతో హడలిపోతున్న జనం

విశాలాంధ్ర - తడ : రోహిణి కార్తె తో భానుడు తన ప్రతాపాన్ని చూపుతుండటంతో జనం ఇంటి నుంచి బయటకు రావడానికి హడలిపోతున్నారు. తడ మండలం లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఎండలు మండిపోతున్నాయి. గత వారం రోజుల నుంచి క్రమక్ర మంగా భానుడి ప్రతాపం పెరుగుతుండడంతో పగటి పూట ఇళ్ల నుంచి బయటకు రావాలంటే జనం భయపడుతున్నారు. ఎండలు తీవ్రంగా ఉండటంతో ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిత్యం జనాలతో రద్దీగా ఉండే మండల కేంద్రంలోని శ్రీకాళహస్తి కూడలి బోసిపోయి కనిపిస్తున్నాయి. వ్యవసాయ కూలీలు, భవన నిర్మాణ కార్మికులు ఇతర కూలి పనులకు వెళ్లే వారు భానుడి ప్రతాపానికి గురికావలసిన పరిస్థితి ఏర్పడింది ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లి తిరిగి మధ్యహ్నాం 2 గంటలకు ఇళ్లకు చేరుకుంటున్నారు భానుడి ప్రతాపానికి తగ్గట్టుగానే విద్యుత్ సరఫరాలో అప్పుడప్పుడు అంతరాయం ఏర్పడటంతో ప్రజలు తీవ్ర అసహనానికి గురవుతున్నారు పాదాచారులు ఎండ వేడిమికి గొడుగులు, తలపై టోపీలు, తువ్వాలు వంటివి కప్పుకుని రాకపోకలు సాగిస్తున్నారు. వయసు మళ్ళిన వృద్ధులు ఎక్కడ చన్నీళ్లు దొరుకుతా యా అంటూ తలపై నీళ్లు చల్లుకునే పరిస్థితి ఏర్పడింది, రోజురో జుకు ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వడదెబ్బ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. బయటకు వెళ్లేట ప్పుడు ఎండ నుంచి రక్షణ చర్యలు తీసుకోవాలని తాగునీటితో పాటు మజ్జిగ, నిమ్మరసం వంటి ద్రావణాలు అందుబాటులో ఉంచుకోవాలని సూచిస్తున్నారు. నైరుతి రుతుపవనాలు ఎప్పుడు సరిహద్దులో ప్రవేశించ పోతుందా అంటూ ప్రజలు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు తడ లో సుమారు 45 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

నాయుడుపేట పట్టణ

వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు

పోట్లపూడి రాజేష్ పై కౌన్సిలర్ అశోక్‌దాడి: కేసు నమోదు.

విశాలాంధ్ర - నాయుడుపేట: నివురు గప్పిన నిప్పులా ఉన్న నాయుడు పేట టౌన్ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీలో విభేదాలు రచ్చకెక్కాయి. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య యువసేన అధ్యక్షులు,వైసిపి ట్రేడ్ యూనియన్ జిల్లా ప్రధానకార్యదర్శి పోట్లపూడి రాజేష్ పై నాయుడుపేట మున్సిపల్ కౌన్సిలర్ కావేరి పాకం అశోక్ కుమార్ తన కుటుంబ సభ్యులతో దాడి చేశారని రాజేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నాయుడుపేట పోలీసులుకేసు నమోదు చేశారు.నాయుడుపేట శ్రీ పోలేరమ్మ జాతర సందర్భంగా చోటు చేసుకున్న మనస్పర్థలు కారణంగా కౌన్సిలర్ అశోక్ తన కుటుంబ సభ్యులతోపాటు మరో ముగ్గురితో కలసి తన ఇంటి వద్దకు వచ్చి కిటికీలు,సి.సి.కెమెరాలు పగలగొట్టి, దాడికి పాల్పడ్డారని రాజేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమెరకు అశోక్ కుటుంబ సభ్యులతోపాటు శ్రీకాంత్, సాయి, వంశీ లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. రెండు రోజుల క్రితం జరిగిన ఈసంఘటన పట్టణంనందు సంచలనమైంది.పార్టీ విభేదాలు రోడ్డుకి ఎక్కకూడదని,పార్టీపెద్దలు మధ్యవర్తిత్వం వహించి ఇరుపక్షాలను సర్దుబాటు చేశారు.రాజేష్ పెద్దమనుషుల మధ్యవర్తిత్తంకు ఒప్పుకోకపోవడంతో పోలీసులు కేసు నమోదు చేసినట్టు తెలుస్తుంది .మరో రెండు రోజుల్లో సార్వత్రిక ఎన్నికల ఫలితాలు వెలుడయ్యే నేపథ్యంలో, గొడవలు టీ కప్పులో తుఫాను వలే సర్దుకుంటాయా? లేక మరింత ముదిరి, పార్టీ ప్రతిష్ట వీధిన పడుతుందా వేచి చూడాల్సిందే.

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - నాయుడుపేట: నాయుడుపేటపట్టణం,స్వర్ణముఖి నదితీరం నందు వెలసివున్న శ్రీఆంజనేయస్వామి వారి దేవస్థానం నందు,శనివారం హనుమాన్ జయంతి పురస్కరించుకుని వేడుకలను ఘనంగా నిర్వహిం చారు.సింధూరంతో, సామూహిక సహస్రనామ అర్చన కార్యక్రమం వేద పండితులు నిర్వహించారు. హనుమాన్ విగ్రహానికి విభూది ,కుంకుమ,సింధూరం లతో అభిషేకాలు జరిపారు. మధ్యాహ్నాం స్థానిక అగ్రహార పేట నందు ఉన్న ఆంజనేయస్వామి దేవస్థానంలో అన్నదాన కార్యక్రమం నిర్వహిం చారు.ఈకార్యక్రమంలో వేలాదిగా భక్తులు పాల్గొని, అన్న ప్రసాదాలను స్వీకరించారు.

ప్యాక్ చైర్మన్ నాదెండ్ల మనోహర్‌ను కలిసి

శుభాకాంక్షలు తెలిపిన దేవర మనోహర్

విశాలాంధ్ర - చంద్రగిరి: మరో మూడు రోజుల్లో తెనాలికి కాబోయే ఎమ్మెల్యే, జనసేన పార్టీ రాజకీయ వ్యవహారాల కమిటీ (ప్యాక్) నాదెండ్ల మనోహర్ ను కలిసి ఆయనకు చంద్రగిరి నియోజకవర్గ ఇన్చార్జ్ దేవర మనోహర్ ముందస్తుగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గంలో ఇటీవల జరిగిన దౌర్జన్య ఖాండ మరియు రాజకీయ పరిస్థితులు గురించి అలాగే వైసిపి చేస్తున్న దౌర్జన్యాలు మరియు నకిలీ కేసులు గురించి కూలంకుషంగా వివరించండం జరిగిందని దేవర ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సుదీర్ఘంగా చర్చించిన తరువాత నాదెండ్ల మనోహర్ చాలా సానుకూలంగా స్పందించి ఎన్నికల నేపథ్యంలో అడ్డంకులు వస్తాయి, అధ్యక్షులు పవన్ కళ్యాణ్ మీకు ఇచ్చిన బాధ్యతలతో మరింత సమిష్టిగా కృషి చేయండి అని, రానున్న రోజులు ఉమ్మడి ప్రభుత్వంది, మీకు పార్టీ అన్ని విధాలుగా లీగల్ టీంతో అండగా ఉంటుందని చెప్పడం జరిగిందన్నారు. కౌంటింగ్ సమయంలో మరింత జాగ్రత్త వహించాలని అన్నివిధాలుగా అప్రమత్తంగా ఉండాలని సూచించారని దేవర మనోహర్ పేర్కొన్నారు.

హనుమంతుని సేవలో ఎస్సీవీ దిలీప్

విశాలాంధ్ర-తొట్టంబేడు: హనుమాన్ జయంతిని పురస్కరించుకుని శ్రీకాళహస్తి మాజీ శాసనసభ్యులు ఎస్సీవీనాయుడు తనయులు ఎస్సీవీ దిలీప్ శనివారం తొట్టంబేడు మండలం గుర్రప్పనాయు డుక ండ్రిగలో హనుమంతుని దర్శించుకున్నారు. స్థానికులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు గోగినేని భాస్కర్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు మండల పరిధిలోని బంగార మ్మకాలనీలో వెలసిన సంకట విమోచన ఆంజనేయస్వామి ఆల యంలో శనివారం హనుమాన్ జయంతి వేడుకలు వైభవంగా నిర్వ హించారు. సంఘ సేవకులు కలవగుంట భరత్ రెడ్డి ఆధ్వర్యంలో ఆంజనేయస్వామికి ఆకుపూజ నిర్వహించడంతో పాటు ప్రత్యేక పూజలు చేశారు. ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఈ సందర్భంగా కలవగుంట భరత్ రెడ్డి స్వామి వారిని వేడుకున్నారు. పూజల అనంతరం ఆలయం వద్ద భక్తులకు అన్నదానం చేశారు. ఈ పూజల్లో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

హనుమాన్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి దంపతులు

విశాలాంధ్ర - పెద్దపంజాణి : సొంత ఊరు కెలవాతి గ్రామంలో శనివారం జరిగిన హనుమాన్ జయంతి కార్యక్రమంలో మాజీ మంత్రి అమర్నాథరెడ్డి వారి సతీమణి రేణుకా రెడ్డి పాల్గొని గ్రామస్తులతో కలసి పూజలు నిర్వహించారు అనంతరం స్వామివారిని దర్శించుకుని కొబ్బరి కాయలు కొట్టి మంగళహారతులు తీసుకున్నారు ఆలయ అర్చకులు దంపతులకు స్వామివారి శాలువులతో సత్కరించి తీర్థ ప్రసాదాలు అందజేశారు

రోడ్డు ప్రమాదంలో యువ ఇంజనీర్ దుర్మరణం

విశాలాంధ్ర - నాయుడుపేట : నాయుడుపేట మండల పరిధిలో శనివారం పండ్లూరు జాతీయ రహదారి సమీపంలో జాతీయ రహదారిపై చోటు చేసుకున్న రోడ్డు ప్రమాదంలో ఓ యువఇంజనీర్ దుర్మరణం పాలయ్యాడు.మృతుని బంధువులు కథనం మేరకు, కోట మండలం వంజివాక గ్రామానికి చెందిన శరత్ కుమార్ రెడ్డి తన కొడుకు, కుమార్తె విద్యాభ్యాసం కొరకు ఓ ప్రైవేటు ఉద్యోగం చేసుకుంటూ సూళ్లూరుపేట పట్టణం, సాయినగర్ నందు నివాసం ఉన్నారు. కుమారుడు హర్షిత్ రెడ్డి(21)విద్యానగర్ ఎన్.బి.కె.ఆర్ ఇంజనీరింగ్ కళాశాల నందు,ఇంజనీరింగ్ రెండవ సంవత్సరం విద్యనభ్యసిస్తున్నాడు. శరత్ కుమార్ రెడ్డి, భార్య గూడూరు పట్టణంలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో శస్త్ర చికిత్స చేసుకొని ఉంది. భార్య యోగక్షేమాలు తెలుసుకోవడానికి,కుమారుడు హర్షిత్ రెడ్డితో కలిసి మోటార్ సైకిల్ పై గూడూరు పట్టణముకు బయలుదేరాడు.వీరు ప్రయాణిస్తున్న బైక్ ను నాయుడుపేట మండలం పండ్లూరు గ్రామం సమీపంలో ప్రమాదవశాత్తు లారీ ఢీకొనడంతో తండ్రి, కొడుకుల ఇద్దరు తీవ్ర గాయాలు పాలయ్యారు.చికిత్స నిమిత్తం నాయుడుపేట ప్రభుత్వాసుపత్రికి తరలించే లోపు కొడుకు తీవ్రగాయాలతో మృతిచెందాడు.కొడుకు తీవ్ర గాయాలు పాలవడం చూసిన తండ్రి, ఆపస్మారక స్థితిలోకి వెళ్లిపోయాడు.శరత్ కుమార్ రెడ్డి ని మెరుగైన చికిత్స నిమిత్తం నెల్లూరు పట్టణానికి తరలించారు.నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి మార్చురి నందు, హర్షిత్ మృతదేహానికి పంచినామా నిర్వహించారు.నాయుడుపేట పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలియజేశారు.పోలీసుల అనుమతితో అంత్యక్రియల నిమిత్తం,హర్షిత్ రెడ్డి మృతదేహాన్ని వారి బంధువులు, మృతుడి స్వగ్రామం వంజివాకకు తీసుకుని వెళ్లారు. తల్లి శాస్త్ర చికిత్స చేసుకునే గూడూరు పట్టణంలో హాస్పిటల్ నందు ఉండడం,తండ్రి రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు పాలై నెల్లూరు నగరం నందు వైద్యశాలలో చికిత్స పొందుతుండడం, అంత్యక్రియల నిమిత్తం,కుమారుడు మృతదేహాన్ని,స్వగ్రామానికి తీసుకు వెళ్లాల్సిన పరిస్థితి దాపురించడంతో,బందుమిత్రులు కన్నీరు మున్నీరుగా విలపిస్తున్నారు. నాయుడుపేట ప్రభుత్వ ఆసుపత్రి పరిసర ప్రాంతాలు మృతిని బంధువుల ఆర్తనాధాలతో నిండిపోయాయి.

శాస్త్రోక్తంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరస్వామి ఆలయంలో హనుమాన్ జయంతి వేడుకలు శనివారం శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఇందులో భాగంగా ముక్కంటి ఆలయ ప్రాంగణంలోని 16కాళ్ల మండపంలో వెలసిన ఆంజనేయస్వామికి ప్రత్యేకంగా అయోధ్య రాముని అలంకరణ చేశారు. అదేవిధంగా స్వామి వారికి వివిధ రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు ఈ వేడుకల్లో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, కార్యనిర్వహణాధికారి ఎస్వీ నాగేశ్వరరావు, ఆలయ అధికారులు, అర్చకులు పాల్గొన్నారు.

వైభవంగా హనుమాన్ జయంతి

విశాలాంధ్ర - కార్వేటినగరం : కార్వేటినగరం బౌండ్ వీధిలోని హనుమాన్ లక్ష్మణ సీతా సమేత శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శనివారం విశేష అభిషేకం అనంతరం ప్రత్యేక అలంకరణ చేసి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పింఛను చేతికిచ్చి ఆదుకోండి... సారూ

నడవలేని స్థితిలో ఉన్న ఒంటరి వృద్ధురాలు

బ్యాంకు అకౌంట్‌లోకి వేసి మమా అనిపించుకున్న అధికారులు

విశాలాంధ్ర - పలమనేరు : వయో వృద్దురాలైన ఓ ఒంటరి మహిళ గత మూడు నెలలుగా పెన్షన్లు అందక ఎవరిని అడగాలో తెలియని దిక్కు తోచని స్థితిలో ఎదురు చూస్తుంది.వివరాలు ఇలా ఉన్నాయి. పలమనేరు రూరల్ మండలంలోని మొసలిమడుగు గ్రామానికి చెందిన యం.జయమ్మ అనే ఈమే గత సంవత్సరం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్నారు గతంలో ఈమేకు ఇంటివద్దకు వచ్చి పెన్షన్ ఇచ్చేవారు ఇప్పుడు ఎలక్షన్ కారణంగా పెన్షన్లు వారి వారి అకౌంట్లలోనే డబ్బులు జమచేస్తున్నారు ఇందులో కొంతమంది వికలాంగులు మరియు బ్యాంకు అకౌంట్లు లేనివారికి నడవలేని వయో వృద్దురాలుకు ఇంటివద్దకు వచ్చి పెన్షన్లు ఇస్తున్నారు కానీ మొసలిమడుగు గ్రామానికి చెందిన జయమ్మ కు సచివాలయం సిబ్బంది నిర్లక్ష్యం కారణంగా పింఛను బ్యాంకు లో జమ చేస్తున్నారు.ఈమే వయస్సు సుమారు 85 సంవత్సరాలు కాగా ఒక సంవత్సరంగా అనారోగ్యంతో బాదపడుతూ ఇంట్లోనే కదలనేని పరిస్థితిలో మంచానికే పరిమితం అయ్యింది ఇలాంటి వారికి పెన్షన్ డబ్బులు రెండు నెలలుగా బ్యాంకు అకౌంట్టుకు వేస్తున్నారు. నడవలేని పరిస్థితిలో ఉన్న కారణంగా జయమ్మ కు సంవత్సరం కాలంగా బ్యాంకు లావాదేవీలు జరపక పోవడంతో అకౌంట్ హెల్డులో పెట్టారు. కానీ ఈమే నడవలేని పరిస్థితిలో ఉన్న కారణంగా పై అధికారులు స్పందించి ఈమేకు ప్రతినెలా ఇంటివద్దకు వచ్చి పెన్షన్ ఇవ్వాలని కోరుతున్నది.వయో వృద్దురాలైన జయమ్మ నిరుపేదరాలు, ఒంటరి మహిళ కావడం తో గత ఒక సంవత్సరం కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నది ఆసుపత్రికి పోవాలంటే కూడా ఇద్దరు ముగ్గురు వెళ్లి ఆటోలోబలవంతంగా తీసుకుపోవాలి ఇలాంటి వృద్దురాలుకు రెండు నెలలుగా పెన్షన్ ఇంటివద్ద ఇవ్వక బ్యాంకు అకౌంట్టులో వేసి అధికారులు మమా అనిపించుకుంటున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు స్పందించి అభాగ్యరాలు, వృద్ధురాలు అయిన జయమ్మ నేరుగా నగదు రూపంలో పింఛను అందించి ఆదుకోవాలని పలువురు గ్రామస్తులు కోరుతున్నారు.

ఎన్నికల ఫలితాల రోజున

ర్యాలీలు.. బాణాసంచా నిషేధం: సిఐ

విశాలాంధ్ర - వి.కోట: దేశ వ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికలు జరిగిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా ఈ నెల 4 వ తేదీన రాష్ట్ర ఎన్నికల ఫలితాల నేపథ్యంలో మండలంలో రాజకీయ పార్టీల నాయకులు ర్యాలీ నిర్వహించడం, బాణాసంచా కాల్చడం నిషేధించినట్లు సిఐ ఎస్. లింగప్ప తెలిపారు. అలాగే మండలంలో 144 సెక్షన్ సైతం అమల్లో ఉందని ఫలితాల రోజున రోడ్ల పైన గుంపులుగా చేరకూడదని అన్నారు. ఈ విషయమై మండలంలోని పద్దెనిమిది పంచాయతీలలోని గ్రామాల్లో మైకు సెట్ ద్వారా ప్రజలకు తెలియజేశారు. ఇందుకు విరుద్ధంగా ఎవరైనా ప్రవర్తిస్తే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు.అంతకు మునుపు స్థానిక పోలీసు స్టేషన్ లో మండలంలోని అఖిల పక్ష నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సి. ఐ లింగప్ప మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు ఎటు వచ్చినా నాయకులు ఆడంబరాలకు పోకూడదని శాంతిభద్రతల కు విఘాతం కల్పించే పనులకు పాల్పడకూడదని కోరారు.

చౌడేపల్లిలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - చౌడేపల్లి : మండల కేంద్రమైన చౌడేపల్లిలో హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు స్థానిక కమలాంజనేయ స్వామి ఆలయంలో ఉదయాన్నే వేద పండితుల ఆధ్వర్యంలో స్వామివారికి విషెస్ అభిషేకము అలంకరణ గావించారు వేద పండితుడు సత్యనారాయణ శర్మ ఆలయ ప్రధాన చప్పుడు వశిష్టాచార్యుల ఆధ్వర్యంలో ఆలయంలో పలు కార్యక్రమాలు జరిగాయి ఉదయం నుంచి వేద మంత్రాలతో పట్టణం దద్దరిల్లింది వినాయక యువజన కమిటీ ఆధ్వర్యంలో కమలా ఆంజనేయస్వామి ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు పట్టణం నుంచి కాకుండా చుట్టుపక్కల ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు వినాయక యువజన కమిటీ సభ్యులు గ్రామ పెద్దలు స్థానికులు పాల్గొన్నారు.

దళిత కుటుంబాన్ని వెలివేసిన దుర్మార్గులను

కఠినంగా శిక్షించాలి

విశాలాంధ్ర - పలమనేరు : దళిత కుటుంబాన్ని వెలివేసిన పెత్తందారు దుర్మార్గులను కఠినంగా శిక్షించాలని జాతీయ మానవ హక్కులు మరియు అవినీతి నిర్మూలన సంస్థ జిల్లా నాయకులు డి.వి. మునిరత్నం వేలాయుధం డిమాండ్ చేశారు. అందులో భాగంగా శనివారం పలమనేర్ పట్టణంలో మానవ హక్కుల కార్యాలయం నందు పార్థసారథి అధ్యక్షతన దళిత కుటుంబం వెలివేత పై సమావేశం నిర్వహించారు. సందర్భంగా నాయకులు మాట్లాడుతూ తిరుపతి జిల్లా కాళహస్తి నియోజకవర్గం పరమాలపల్లి పెత్తందారులు గ్రామంలో నిర్వహిస్తున్న తాంత్రిక పూజలను అడ్డుకున్నాడనే నెపముతో కక్షగట్టి దళిత బాలరాజు కుటుంబీకులను గ్రామము నుండి సాంఘిక బహిష్కరణ చేయడం , కలిసి ఉండాలంటే లక్ష రూపాయలు జరిమానా, బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదేశాలివ్వడం పిరికిపంద చర్యగా అభివర్ణించారు. పొట్టకూటి కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి పనులకు వెళ్ళితే ఆ కుటుంబం పై లీలను రెచ్చగొట్టి పనులకు రానీయకుండా అవమానించడం దుర్మార్గమన్నారు. ఈ విషయం తెలిసినా తెలియనట్లు అధికారులు వ్యవహరించడం, చూస్తుంటే అధికారులకు కూడా దళితులపై వివక్ష ఉన్నట్టేనని అభిప్రాయపడ్డారు. ఉపాధి పనులు పెత్తందారుల బాబు సొమ్ము కాదనే విషయం గుర్తుంచుకోవాలన్నారు .ఈ అవమానాన్ని భరించలేక బాలరాజు భార్య పద్మమ్మ మనస్థాపం చెంది ఆత్మహత్యాయత్నానికి పాల్పడడానికి కారణమైన గ్రామ పెత్తందారులు, మండల ఉపాధి అధికారులు, సాటి కూలీలపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని లేనిపక్షంలో బాధితులకు అండగా నిలిచి న్యాయం జరిగే వరకు పోరాడుతామన్నారు.

ఏపీ మొత్తం మీద నగరిదే తొలి ఫలితం కానుందా

వేయి కళ్ళతో ఎదురు చూసిన అభ్యర్థులు, అంతకు మించి ఓటర్లు, కార్యకర్తలకు ఆ రోజు రానే వచ్చేసింది

- ఇంకో మూడంటే మూడు రోజుల్లోనే ఫలితాలు రాబోతున్నాయి

విశాలాంధ్ర - పుత్తూరు టౌన్ : నగరి నియోజకవర్గంలోని రాష్ట్ర మొత్తం మీద ప్రజలకు నాయకులకు కార్యకర్తలకు మేధావులకు ఇక ఫలితాల విషయానికొస్తే జూన్ నాలుగో తేదీన ఉదయం ఫలితాలు మొదలై.. 11 నుంచి 12 గంటల మధ్యలో తొలి ఫలితం వెలువడనుంది. ఆ ఫలితం కూడా ఏపీ మంత్రి, ఫైర్ బ్రాండ్ రోజా ..మాజీ మంత్రి గాలి ముద్దుకృష్ణ నాయుడు కుమారుడు భాను ప్రకాష్.. జాతకం బయటపడుతుంది. ఏపీ మొత్తం మీద నగరి నియోజకవర్గం ఫలితం తొలి ఫలితంగా రానుందని సమాచారం. ఎందుకు ఇలా? చిత్తూరు జిల్లాలో మొత్తం ఏడు నియోజకవర్గాలు ఉండగా ఇందులో తొలి ఫలితం వెలువడేది నగరి నియోజకవర్గానిదే. ఈ ఏడు నియోజకవర్గాలతో పోలిస్తే నగరిలోనే ఓటర్ల సంఖ్య తక్కువ. నగరిలో మొత్తం ఓటర్ల సంఖ్య 2,02,574 మాత్రమే. ఇక్కడ 229 పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ జరిగ్గా.. కౌంటింగ్ రోజున 14 టేబుళ్లలో లెక్కింపు జరగనుంది. ఇక రౌండ్ల విషయానికి వస్తే.. 17 రౌండ్లలో ఫలితాలు రానున్నాయి. ఇంచు మించు 12 గంటలలోపే రోజా, భాను జాతకం తేలిపోనుంది. నగరి కౌంటింగ్ పూర్తి ఐతే.. జిల్లాలో తొలి ఫలితంతో పాటు రాష్ట్ర వ్యాప్తంగా మొదటిదే కానున్నది. రోజా గెలుస్తారో ? భాను గెలుస్తారో ? నగరి నియోజకవర్గం మునుపటిలా లేదు.. వైసీపీకి అంటే ప్రాణం ఇచ్చే వాళ్ళంతా చివరి నిమిషంలో జెండా పీకేసి.. పసుపు కండువాలు కప్పుకున్నారు. పోతూ.. పోతూ రోజాపై కనీ ఎరుగని రీతిలోఅభాండాలు వేసిపోయారు. దీంతో ఎక్కడలేని నెగటివ్ రోజాపై వచ్చింది. ఇది టీడీపీ నుంచి పోటీ చేసిన గాలి భాను ప్రకాష్ ఈసారి గట్టిగానే కష్టపడ్డారు. గత ఎన్నికల్లో 2,708 ఓట్ల తేడాతో ఓడిపోయిన గాలి భాను ప్రకాష్ ఈసారి ఎట్టి పరిస్థితుల్లోనూ గెలిచి అసెంబ్లీలోకి అడుగు పెట్టాలని కష్టపడ్డారు. ఐతే రోజా మాత్రం అప్పే అసెంబ్లీ సంగతి అటుంచితే.. అసెంబ్లీ గేట్ కూడా తాకనివ్వనని చెబుతున్నారు. ఇంత ధీమాగా ఉన్న రోజా గెలిచి హ్యాట్రిక్ కొడతారా. లేకుంటే గాలి భాను గెలిచి తొలిసారి అసెంబ్లీలోకి అడుగు పెడతారా.. అన్నది జూన్ నాలుగో తేదీన ఉదయమే తెలిపోనున్నది. లెట్స్ వెయిట్ అండ్ సీ..!

సమాజ సేవలో భాగస్వాములు అవుదాం

- యల్లంపాటి కోటేశ్వరబాబు

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: సమాజ సేవలో భాగస్వాములు అవుదామని ప్రముఖ సంఘ సేవకులు యల్లంపాటి కోటేశ్వరబాబు పిలుపునిచ్చారు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని చెంచులక్ష్మీకాలనీకి చెందిన సుమారు 50 గిరిజన విద్యార్థులకు శనివారం ఆయన విద్యాసామాగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా యల్లంపాటి కోటేశ్వరబాబు మాట్లాడు తూ... పేద విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలనే ఆశయంతో తనవంతు సాయంగా విద్యాసామాగ్రి అందచేస్తున్నానన్నారు. ఇప్పటికే భరద్వాజ గిరిజన కాలనీ, జయరామరావువీధి కోనేటి వద్ద గల గిరిజన కాలనీలో గల పేద విద్యార్థులకు విద్యా సామాగ్రి అందించానని ఆయన తెలిపారు. ఇప్పటి వరకు శ్రీకాళహస్తి పట్టణంలో సుమారు 120మంది గిరిజన విద్యార్థులకు విద్యాసామాగ్రి అందచేయడం ఎంతో ఆనందంగా ఉందని కోటేశ్వరబాబు అన్నారు. భవిష్యత్తులో కూడా ఈ సేవా కార్యక్రమం కొనసాగిస్తానని ఆయన తెలిపారు. పేదలకు సేవ చేయడంలో ఉన్న సంతృప్తి ఎందులో ఉండదన్నారు. సాయం పొందినపుడు వారి కళ్లలో ఆనందం చూడటానికి కనులు చాలవన్నారు. తనకు ఉన్నదానిలోనే పేద విద్యార్థులకు సాయం చేస్తూ ఆనందం పొందుతున్నానని కోటేశ్వరబాబు తెలిపారు. గిరిజన విద్యార్థులు బాగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. భవిష్యత్తులో కూడా వీరికి అండగా ఉంటానని కోటేశ్వరబాబు భరోసా ఇచ్చారు.నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్న కోటేశ్వర బాబును చెంచు లక్ష్మీ కాలనీ గిరిజన వాసులు కృతజ్ఞతలు ధన్యవాదాలు తెలియజేశారు.

ముక్కంటి సేవలో ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

విశాలాంధ్ర -శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని శనివారం తూర్పు రాయలసీయ పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి సభ్యులు కంచర్ల శ్రీకాంత్, చిత్తూరు ఎన్డీయే కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి గురజాల జగన్మోహన్ దర్శించు కున్నారు. శ్రీకాళహస్తి టీడీపీ నేతలు వీరికి స్వాగతంపలికారు. కంచర్ల శ్రీకాంత్, గురజాల జగన్మోహన్ మొదట రాహు-కేతు సర్వదోష నివారణ పూజలు చేసుకున్నారు. అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి సన్నిధిలో ఆలయ పండితులు వీరికి ఆశీర్వచనం ఇచ్చారు. స్వామి అమ్మవార్ల తీర్థ ప్రసాదాలు, జ్ఞాపిక అందజేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేతలు చెంచయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మిల్లు యాజమాన్యంపై చర్యలు తీసుకోండి

- డీఎస్పిని ఆదేశించిన ఆర్డీఓ

విశాలాంధ్ర - శ్రీకాళహస్తి : రబీలో రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యానికి బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తున్న హేమ సింధు మోడ్రన్ రైస్ మిల్ యాజమాన్యంపై కేసు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని శ్రీకాళహస్తి ఆర్డీఓ రవి శంకర్ రెడ్డి డీఎస్పీ ఉమామహేశ్వరరావుకు ఆదేశాలు జారీ చేశారు. ఏర్పేడు మండలం చింతలపాలెం గ్రామానికి చెందిన లోకేష్ యాదవ్ అనే ఓ వడ్ల వ్యాపారి ఈనెల 29న హేమ సింధు మోడ్రన్ రైస్ మిల్లు యాజమాన్యం తన ద్వారా రైతులకు రావాల్సిన రూ.5 లక్షల పెండింగ్ బిల్లులను చెల్లించకుండా నిర్లక్ష్యం చేస్తోందంటూ ఆర్డీఓ కు ఫిర్యాదు చేశారు. స్పందించిన ఆర్డీఓ వెంటనే మిల్లు యాజమాన్యంపై చర్యలు చేపట్టి బాధిత రైతులకు న్యాయం జరిగేలా చూడాలని శుక్రవారం ఆదేశించారు.

హనుమ జయంతి సందర్భంగా మిద్దింటి కిషోర్ చే అన్నదాన శిబిరం

విశాలాంధ్ర - చౌడేపల్లి : హనుమ జయంతిని పురస్కరించుకొని స్థానిక కమలా ఆంజనేయ స్వామి స్వామి ఆలయంలో పలు కార్యక్రమాలు నిర్వహించారు ఆలయం ముందు రాజంపేట చిత్తూరు పార్లమెంటరీ నియోజకవర్గాల వైఎస్ఆర్సిపి యూత్ వర్కింగ్ ప్రెసిడెంట్ మిద్దింటి కిషోర్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పిల్లారి జీవన్ ప్రకాష్ కడియాల రాజన్న కడియాల మహేష్ బాబు లీలకుమార్ నాగ్ తౌడు గణేష్ పగడాల రామ్మూర్తి కాటిపేరి మురళి చౌడేపల్లి గ్రామస్తులు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

షరుతులు వర్తిస్తాయి జర జాగ్రత్త

విశాలాంధ్ర - గుడిపాల : గుడిపాల ప్రజలకు పోలీసు వారి విజ్ఞప్తి 2024 సార్వత్రిక ఎన్నికలలో భాగంగా చిత్తూరు జిల్లా అంతటా 144 సెక్షన్ అమలులో వుంది కావున ఎవరు కూడా గుంపు కూడి వుండకూడదు, నలుగురు వ్యక్తులు కంటే ఎక్కువ గుంపుగా వుండరాదు అని ఒక ప్రకటనలో ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు, ఈ ఎన్నికల కోడ్ అమలులో వున్నందున ఎక్సిట్ పోల్స్ మరియు కౌంటింగ్ సమయములో ఎవరూ రోడ్ల మీదకి రాకూడదు ఎలాంటి టపాకాయలు కానీ ర్యాలీలు కానీ చేయకూడదు ఎవరైనా గలాటలకి పాల్పడినా, రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసినా చట్ట పరమైన చర్యలు తీసుకోబడును. కావున ప్రజలు పోలీసు వారికి సహకరించగలరు.

ఎన్నికల ఫలితాల సమయంలో గొడవలకు దూరంగా ఉండండి

: సిఐ రామయ్య

విశాలాంధ్ర - చంద్రగిరి: ఎన్నికల ఫలితాల సమయంలో గొడవలకు దూరంగా వుండాలని చంద్రగిరి సీఐ. రామయ్య తెలిపారు. శనివారం ఉదయం చంద్రగిరి మండలంలోని పన పాకం పంచాయతీ, అరిగల వారి పల్లిలో, ఎం.కొంగరవారి పల్లి, అయితే పల్లి, అగరాల గ్రామాలలో చంద్రగిరి డి.ఎస్.పి., ఏపీ గ్రేహౌండ్స్, ఎస్పిఎఫ్ పోలీసు బలగాలతో కలిసి సీఐ.రామయ్య కవాతు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 144 సెక్షన్ అమలులో ఉందని అన్నారు. పోలీసు 30 యాక్ట్, 144 సెక్షన్ లు అమలులో ఉన్న కారణంగా ఎవరైనా అల్లర్లకు పాల్పడినా, గొడవలకు కారణం అయిన వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. యువత గొడవలకు వెళ్ళి జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. దీనిని దృష్టిలో ఉంచుకొని యువత కేసులకు దూరంగా ఉండాలన్నారు. రౌడీ షీటర్లు గొడవలలో పాల్పడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని సీఐ.రామయ్య హెచ్చరించారు.

బోర్ మోటార్ కేబుల్ చోరీ

విశాలాంధ్ర - పాకాల : పాకాల మండలంలోని సామి రెడ్డి పల్లి పంచాయతీ కోనపురెడ్డిపల్లికి చెందిన రైతు ద్వారకా బాబు పొలంలో శు క్రవారం రాత్రి దొంగలు పడి కేబుల్ వైరు కత్తిరించుకుని వెళ్లారు. తోటపల్లి సమీపంలోని పూతలపట్టు ం నాయుడుపేట జాతీయ రహదారి ఆనుకుని ఉన్న రైతు పొలంలోకి చొరపడిన దొంగలు బోరు వద్దగల స్టార్టర్ బాక్సు ను పగలగొట్టి ఫీజు క్యారియర్ల ను ధ్వంసం చేసి సుమారు 20 మీటర్ల కేబుల్ ను కత్తిరించుకుని వెళ్లారు. అక్కడే ఉన్న సింటెక్స్ వాటర్ ట్యాంక్ తో పాటు పైపులకు నిప్పు పెట్టి నష్టం కలిగించినట్లు ఆ రైతు వాపోయారు. గతంలోనూ ఇదేవిధంగా అనేకసార్లు చోరీ జరిగినట్లు రైతు తెలిపారు. ఈ మేరకు రైతు ద్వారాకబాబు పాకాల పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

కల్పవృక్ష వాహనంపై ఊరేగిన వేణుగోపాలుడు

విశాలాంధ్ర - కార్వేటినగరం: వార్షిక బ్రహ్మోత్సవాలలో భాగంగా నాలుగవ రోజైన శనివారం ఉదయం శ్రీవేణుగోపాలుడు కల్పవృక్షవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనం మిచ్చారు. ఉదయం సుప్రభాతసేవతో స్వామివారిని మేల్కొలిపి శద్ధి, తోమాల, పంచాంగశ్రవణం నిత్యకైంకర్యాలు నిర్వహించారు. అనంతరం స్వామివారు కల్పవృక్షవాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరిస్తూ, భక్తులచే కర్పూర హారతులను అందుకున్నారు. అనంతరం అర్చకులు వేదమంత్రాలు, మంగళవాయిద్యాల నడుమ పాలు, పెరుగు, తేనె, పసుపు, చందనం, నారికేళ జలాలతో స్నపన తిరుమంజనం నిర్వహించారు. ధూప, దీప, నైవేద్యాలతో రెండవ గంట నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలను అందచేశారు. -కనువిందుగా కళ్యాణోత్సవం బ్రహ్మోత్సవాల సందర్భంగా శనివారం సాయంత్రం వేణుగోపాల స్వామి ఆలయంలో ఉభయ నాంచారుల సమేత శ్రీవేణుగోపాలునికి నిర్వహించిన కళ్యాణోత్సవం భక్తులకు కనువిందు చేసింది. 5గంటల నుంచి 6.30 వరకు గంట పాటు జరిగిన ఆర్జిత కళ్యాణోత్సవంలో అధిక సంఖ్యలో దంపతులు పాల్గొని తీర్థ ప్రసాదలతో పాటు వస్త్రబహుమానం అందుకున్నారు. ఈ సందర్భంగా వేదపండితుల వేదమంత్రాల నడుమ ఉభయనాంచారుల శిరస్సులపై ముత్యాల తలంబ్రాలు పోసి అత్యంత వైభవంగా కళ్యాణోత్సవాన్ని నిర్వహించారు. స్వామివారి కళ్యాణాన్ని తిలకించేందుకు పలు గ్రామాల నుండి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి తిలకించారు. హాజరైన భక్తులకు టీటీడీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. అనంతరం ఆలయ ఆవరణంలోని అలంకరణ మండపంలో ఉభయ దేవేరులతో పాటు శ్రీవేణుగోపాలుడుని పట్టు వస్త్ర సుగంధ పుష్పాలతో సుందరంగా అలంకరించడంతో స్వామి వారు సర్వభూపాల వాహనాన్ని అధిరోహించి పురవీధుల్లో విహరించారు. చిన్నారుల కోలాటాలు, మహిళల చెక్కభజనల మధ్య అత్యంత వైభవంగా ఊరేగారు. రాత్రి పదిగంటలకు వేదపండితులు ఏకాంత సేవలో స్వామివారిని పవళింపజేశారు. ఈకార్యక్రమంలో డిప్యూటీ ఈవో నాగరత్న, ఏఈవో పార్ధసారథి, సూపరింటెండెంట్ సోముశేఖర్, ఆలయాధికారి సురేష్కుమార్, షరాబ్ బాబుసురేష్, కంకణభట్టార్యులు నారాయణం దాశరథి, తరుణ్కుమార్, అలంకార పండితులు, టీటీడీ సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు,

ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళం

విశాలాంధ్ర - తిరుమల: టీటీడీ ఆధ్వర్యంలో నడుస్తున్న ఎస్వి అన్నదాన ట్రస్ట్ కు రూ. 10 లక్షల విరాళం అందింది. చెన్నైకి చెందిన కిరోరీమల్ కాశీరామ్ మార్కెటింగ్ అండ్ ఏజెన్సీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ టీటీడీ ఎస్వీ అన్నప్రసాదం ట్రస్టుకు శనివారం రూ.10 లక్షలు విరాళంగా అందించారు. తిరుమల శ్రీవారి ఆలయం ముందు సంస్థ ప్రతినిధి రాఘవేంద్ర టీటీడీ ఈవో ఎవి.ధర్మారెడ్డికి ఈ మేరకు చెక్కును అందజేశారు.

500 మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ

విశాలాంధ్ర - గూడూరు: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం ఆధ్వర్యంలో హనుమజ్జయంతిని పురస్కరించుకుని 500 మందికి మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. పట్టణ, రూరల్ సీఐలు రవికిరణ్, వేణుగోపాల్ రెడ్డి హాజరై బ్రాహ్మణ సేవా సంఘం సేవలను కొనియాడారు. అనంతరం మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షులు అనిమెళ్ల శివకుమార్, పలువురు సభ్యులు పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతి

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు గ్రేడ్ వన్ మున్సిపాలిటీ పరిధిలోని నెల్లటూరు గ్రామ సమీపంలో నిర్జీవ ప్రదేశంలో సుమారు 50 ఏళ్ల వయసు కలిగిన ఒక గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గుర్తించామని ఆ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రికి తరలించి మృతుని వంటిపై గాయాలు కనిపిస్తుండడంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని పరిశీలించిన రూరల్ సీఐ వేణుగోపాల్ రెడ్డి, ఎస్ఐ మనోజ్ మాట్లాడుతూ మృతుని శరీరంపై బులుగు రంగు నిక్కరు మాత్రమే ఉందన్నారు. మృతుని వద్ద ఎటువంటి ఆధారాలు లభించకపోవడంతో గుర్తు తెలియని వ్యక్తి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామన్నారు. వివరాలు తెలిసినవారు పోలీసులను సంప్రదించాలని కోరారు.

వైభవంగా హనుమజ్జయంతి ఉత్సవాలు

విశాలాంధ్ర - వాకాడు: మండల పరిధిలోని బాలిరెడ్డిపాళెం గ్రామంలోని శ్రీ పట్టాభి రామాలయంలో హనుమజ్జయంతి వేడుకలు వైభవంగా నిర్వహించారు. సుప్రభాత సేవ, ప్రాతఃకాల ఆరాధనలతో ప్రారంభమైన పూజా కార్యక్రమాలు శ్రీ హనుమత్, లక్ష్మణ, సీతా సమేత పట్టాభిరామచంద్ర స్వామి వారికి చతుర్దశ కలశ స్నపనలు, ఆంజనేయ స్వామి వారికి సహస్ర నాగవల్లి దళార్చన, విశేష పూజలు, ద్వాదశ ఆరాధన, ద్వాదశ ప్రదక్షిణలు కార్యక్రమాలకు ఉభయకర్తలుగా పుట్టం వెంకటేశ్వర్లు రెడ్డి, అనూరాధ దంపతులు వ్యవహరించారు. ఆలయ ప్రధాన అర్చకులు దీవి అనంతాచార్యులు పూజాదికాలు జరిపించారు. విచ్చేసిన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో వాకాడు సొసైటీ చైర్మన్ కొడవలూరు దామోదర రెడ్డి, శ్రీరామసేన అధ్యక్ష కార్యదర్శులు కొడవలూరు హరీష్ రెడ్డి, శివకుమార్, గురు ప్రసాద్, మోహన్, రాజేష్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

తాత్కాలిక చాపల మార్కెట్‌లో

అగ్నిప్రమాదం

- రూ. 7 లక్షల నష్టం

విశాలాంధ్ర - గూడూరు: గూడూరు పట్టణంలోని ఐసీఎస్ రోడ్డులో ఉన్న తాత్కాలిక చాపల మార్కెట్లో శుక్రవారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. సుమారు 7 లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. చాపల మార్కెట్లోని ఒక దుకాణంలో షార్ట్ సర్క్యూట్ తో మంటలు చెలరేగి సుమారు నాలుగు షాపులు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. దుకాణాల్లోని ఎండు చేపలు, పచ్చి చేపలు అగ్నిలో కాలిపోవడంతో సుమారు ఏడు లక్షల రూపాయల మేర నష్టం వాటిల్లినట్లు బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అగ్నిమాపక సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేశారు.

పిల్లారి జీవన్ చే స్వామివారికి గొడుగు వితరణ

విశాలాంధ్ర - చౌడేపల్లి: స్థానిక పిల్లారి ఏజెన్సీస్ అధినేత పిల్లారి జీవన్ ప్రకాష్(జీవి) పట్టణంలోని కమలాంజనేయ స్వామి ఆలయంలో స్వామివారికి రూ 25 వేలు విలువచేసే గొడుగును బహుకరించారు హనుమ జయంతి సందర్భంగా ఉత్సవ మూర్తికి పిల్లారి జీవన్ ప్రకాష్ గొడుగు బహూకరించారు ఈ కార్యక్రమంలో వినాయక యువజన కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు

ఆల్కహాల్ సేవించి ఎన్నికల కౌంటింగ్‌కి రావద్దు

: ఎస్సై ప్రతాపరెడ్డి

విశాలాంధ్ర - చౌడేపల్లి: మద్యం సేవించి ఎన్నికల కౌంటింగ్ కి రాకూడదని ఎస్సై ప్రతాపరెడ్డి అన్నారు శనివారం స్థానిక పోలీస్ స్టేషన్లో ఆయన మాట్లాడుతూ ఈనెల 4న చిత్తూరు నందు ఎన్నికల కౌంటింగ్ నిర్వహించబడుతుందన్నారు కౌంటింగ్లో ఎవరు కూడా మద్యం సేవించి రాకూడదన్నారు బ్రీతింగ్ ఎనలైజర్ ఉంటుంది కాబట్టి ప్రతి ఒక్కరిని తనిఖీ చేసి లోనికి పంపడం జరుగుతుందని మద్యం సేవించిన వారిని బయటకు పంపివేయడం జరుగుతుందన్నారు కౌంటింగ్ ఏజెంట్లు తప్పనిసరిగా ఈ విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని ఆయన కోరారు

కమలాంజనేయ స్వామికి మకర తోరణం అందించిన కమల కుమార్

విశాలాంధ్ర - చౌడేపల్లి: స్థానిక కమలాంజనేయ స్వామికి మకర తోరణాన్ని విరాళంగా అందించారు హనుమాన్ జయంతి సందర్భంగా పుంగనూరు కు చెందిన కమల కుమార్ రూ 60 వేలు విలువచేసే మకర తోరణాన్ని అందించారు వారిని ఆలయ ప్రధానార్చకుడు వశిష్ఠాచార్యులు సాదరంగా ఆహ్వానించి స్వామివారి దర్శనానంతరం పవిత్ర తీర్థప్రసాదాలు అందించారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

విశాలాంధ్ర - తడ: మండల కేంద్రమైన తడ సుజాతనగర్ సమీపంలో జాతీయ రహదారిపై శనివారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు పాలైన సంఘటన చోటుచేసుకుంది స్థానికుల సమాచారం మేరకు తడ సిటీ యూనియన్ బ్యాంక్ వద్ద గల అపార్ట్మెంట్ సమీపంలో నివాసం ఉంటున్న రోశయ్య అపార్ట్మెంట్ వద్ద ఇస్త్రీ పనులు చేసుకుంటూ జీవనం సాగించేవారు ఇస్త్రీ చేసిన బట్టలను ఎదురుగా నున్న అపార్ట్మెంట్ వారికి బట్టలు డెలివరీ చేసేందుకు రోడ్డు దాటుతుండగా సూళ్లూరుపేట నుండి చెన్నై వైపు వెళ్లే మార్గంలో గుర్తుతెలియని మోటార్ సైకిల్ ఢీకొని రోశయ్య క్రింద పడటంతో వెనుకనే అతివేగంగా వస్తున్న రెండు కార్లు ఢీ కొట్టి ఆగకుండా వెళ్లాయి ఈ ప్రమాదంలో రోశయ్య రెండు కాళ్ళు ఓ చేయి తీవ్రగాయాలు కావడంతో స్థానికులు వెంటనే 108 వాహనం ద్వారా సూళ్లూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు

ఎన్నికల ప్రవర్తనా నియమావళి పాటించాలి

విశాలాంధ్ర – సోమల : సోమల మండలంలోని సమస్యాత్మక గ్రామాలైన కందూరు, తమ్మినేనిపల్లి గ్రామాలలో శనివారం గ్రామసభలు నిర్వహించారు. ఎస్ఐ వెంకట నరసింహులు మాట్లాడుతూ ఎగ్జిట్ పోల్స్ ఫలితాలపై ఆధారపడరాదని సూచించారు. ఫలితాలు వచ్చేవరకు వేచి ఉండాలని అన్నారు. కౌంటింగ్ సమయం లో అల్లర్లకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ఉద్యోగం చేసుకుని తిరుగు ప్రయాణంలో తిరిగిరాని లోకాలకు సుందర్ రాజపురం వద్ద ఘటన

విశాలాంధ్ర – గంగాధర నెల్లూరు : ఉద్యోగరీత్యా విధులు ముగించుకొని ఇంటికి వెళుతుండగా తిరిగిరాని లోకాలకు వెళ్లిన ఘటన శనివారం ఉదయం మండలంలోని సుందర్ రాజపురం వద్ద చోటుచేసుకుంది. స్థానిక పోలీసుల వివరాల మేరకు గంగాధర నెల్లూరు మండలం వేపంజేరి పంచాయితీ సర్విరెడ్డిపల్లి గ్రామానికి చెందిన సుబ్బారెడ్డి కుమారుడు ఉదయ్ కుమార్ రెడ్డి (26) జూనియర్ లైన్మెన్ గా తాళంబేడు సచివాలయంలో విధులు నిర్వర్తిస్తున్నాడు. ఉదయ్ కుమార్ తన భార్య సుష్మ కూతురుతో కలిసి చిత్తూరులోని మైదా ఫ్యాక్టరీ సమీపంలో నివాసం ఉంటున్నాడని, శుక్రవారం రాత్రి తాళం బెడు గ్రామంలో కరెంటు లేదని గ్రామస్తులు ఫోన్ చేయగా తాళంబేడుకు వెళ్లి తన విధులు నిర్వర్తించి ఇంటికి తిరిగి వస్తుండగా సుందర్ రాజపురం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడని తెలిపారు. స్థానిక పోలీసులు అక్కడిక చేరుకొని సంఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. కేసు నమోదు చేసి పూర్తి దర్యాప్తు చేస్తామని సీఐ శంకర్ తెలిపారు.

ద్విచక్ర వాహనాన్ని ఢీకొన్న లారీ

తీవ్రంగా గాయపడిన ద్విచక్ర వాహనదారుడు

మెరుగన్న వైద్యం కోసం తిరుపతి రూయా ఆసుపత్రికి తరలింపు

విశాలాంధ్ర – పుత్తూరు టౌన్ : నారాయణ వనం మండలం పాలమంగళం సౌత్ శనివారం సాయంత్రం వారం సంత జరుగుతున్న సమయంలో అయ్యారు కండిగ నుండి పాలమంగళం వారం సంతకు గుణ హీరో హొండా ద్విచక్ర వాహనాన్ని వెళుతున్న సమయంలో నాగలాపురం నుండి అతి వేగంగా వస్తున్న లారీ డ్రైవర్ ద్విచక్ర వాహనాన్ని ఢీకొనడంతో 200 అడుగుల దూరంతో లారీ రోడ్డుపైన లాక్కోపోవడంతో పెట్రోలు లీకై మంటలు ఒకేసారి చాలారేగి స్కూటర్ మొత్తం పూర్తిగా మంటల్లోనే కాలిపోయాయి స్థానికుల గమనించి సంఘటన స్థలానికి చేరుకొని నారాయణ వనం పోలీసు పోలీస్ శాఖ సమాచారం అందించడంతో సంఘటన స్థలానికి చేరుకొని గాయపడిన గుణాన్ని వైద్యం కోసం తిరుపతి హాస్పిటల్ కి తరలించారు లారీ డ్రైవర్ ని అదుపులో తీసుకొని ఎస్సై లక్ష్మీనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తానని తెలిపారు

కాణిపాకంలో ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

విశాలాంధ్ర –చిత్తూరు: కాణిపాకం శ్రీ వరసిద్ధి వినాయక స్వామి అనుబంధ దేవాలయ మైన శ్రీ వీరాంజనేయ స్వామి వారి ఆలయం నందు హనుమాన్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. హనుమాన్ జయంతిని పుష్కరించుకొని ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ వీరాంజనేయ స్వామి వారికి పట్టు వస్త్రాలను దేవస్థానం ఈవో వెంకటేశు అందజేశారు, స్వామివారికి ప్రత్యేక అభిషేకము ప్రత్యేక ఆకు పూజలు నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఆలయ ఏఈఓ హరి మాధవరెడ్డి, సూపర్డెంట్లు కోదండపాణి, వాసు, టెంపుల్స్ ఇన్స్పెక్టర్ రమేష్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి మెట్టులో వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



విశాలాంధ్ర–చంద్రగిరి: చంద్రగిరి మండలం, మిట్టపాలెం పంచాయతీ, శ్రీవారి మెట్టు, శ్రీ భక్తాంజనేయ స్వామి దేవాలయములో హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం ఉదయం నుంచి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహించారు. ఉదయం 5 గంటల నుండి 6 వరకు స్వామి వారికి అభిషేకం, తరువాత 6 గంటల నుండి 8 వరకు స్వామి వారికి అలంకరణ, 8 గంటల నుండి స్వామి వారికి సప్త హారతులు, నైవేద్యం, 9 నుండి 4 వరకు నృత్య, సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటాలు, హరేరామ భజనలు,చెక్క భజనలు, భక్తిగీతాలాపనలు నిర్వహించారు. మధ్యాహ్నం వేళ అన్నదానం నిర్వహించారు. అలాగే సాయంత్రం 4 గంటలకు స్వామి వారి పల్లకి ప్రాకారో త్సవంను వైభవంగా నిర్వహించారు. సాయంత్రం 6 గంటల నుండి మరుసటి రోజు ఉదయం 6 వరకు హరేరామ భజనలు జరుగును .పై కార్యక్రమాలలో విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామి వారి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఏకవీర సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో

ఘనంగా హనుమాన్ జయంతి

విశాలాంధ్ర– రామచంద్రాపురం: ఏకవీర సేవా ఫౌండేషన్ వ్యవస్థాపకులు ప్రతాప్ స్వామి ఆధ్వర్యంలో నెత్తకుప్పం లోని కట్లకనుమ వద్ద వెలసిన ఆంజనేయ స్వామి ఆలయం లో హనుమాన్ జయంతి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు ముందుగా ప్రతాప్ స్వామిజీ హనుమాన్ విగ్రహానికి వివిధ రకాలైన పండ్లు తమలపాకులు, వడలు, నిప్పట్లు , బొప్పెట్లు,అప్పాలతో నైవేద్యంగా సమర్పించారు, స్వామి వారికి ప్రత్యేక అలంకరణలు చేసి పూజలు నిర్వహించారు అనంతరం సమీపంలో ఉన్న ఉన్న వినాయక స్వామికి దక్షిణామూర్తికి పూజల నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతాప్ స్వామి మాట్లాడుతూ ఈ కట్ల కణంలో ఉన్న ఆంజనేయస్వామి మహా మహిమాన్విత స్వామి అన్నారు. ఈ ఆంజనేయస్వామిని ప్రతిరోజు పూజించడం ద్వారా దుష్టశక్తులు దగ్గరికి రావు అన్నారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని ఈరోజు పూజించడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా ఇక్కడికి వచ్చిన భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేసి అల్పాహారం అందజేశారు.

ఆశ్రిత చైల్డ్ డెవలప్మెంట్ సెంటర్‌ను ప్రారంభించిన నగర మేయర్ డాక్టర్ శిరీష

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతిలోని మొట్టమొదటిసారిగా మానసిక వైద్యనిపుణులచే ఎదుగుదల లోపం ఉన్న పిల్లల కోసం స్వచ్ఛందంగా సేవలు అందించడానికి ఆశ్రిత చిల్డ్రన్ డెవలప్మెంట్ సెంటర్ ను డాక్టర్ కవిత, డాక్టర్ భారతి గార్లచే స్థాపించబడినది. శనివారం ఉదయం అబ్బన్నకాలనీలో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష ప్రారంభించి ఈ సంస్థ సేవల గురించి వివరించారు. చిన్నపిల్లల్లోని అన్ని మానసిక రుగ్మతలకు వైద్యం అందించబడుతుందని, తల్లిదండ్రులకు అవగాహన కల్పించబడుతుంది. పిల్లల మానసిక రుగ్మతలకు ప్రాథమిక దశలోనే గుర్తించి, తగిన వైద్యం అందించిన ఎడల వారి బాల్యాన్ని వారికి తిరిగి అందించగలుగుతాం. అందుకోసం నిపుణుల పర్యవేక్షణలో వైద్యం, స్పీచ్ థెరపీ ఆక్యుపేషనల్‌థెరపీ, స్పెషల్ ఎడ్యుకేషనల్ సేవలు అందించ బడుతుందని పేర్కొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును

సమర్థవంతంగా నిర్వహించాలి

- జిల్లా జాయింట్ కలెక్టర్

విశాలాంధ్ర - చిత్తూరు : పోస్టల్ బ్యాలెట్ లెక్కింపును సమర్థవంతంగా నిర్వహించాలని జిల్లా జాయింట్ కలెక్టర్ పి. శ్రీనివాసులు తెలిపారు. శనివారం కలెక్టరేట్ సమావేశం హాల్ నందు డి ఆర్ ఓ.బి.పుల్లయ్య,శిక్షణ అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ,ఆర్ ఓ లు,ఏ ఆర్ ఓ లులతో కలసి జూన్ నెల 4న ఎస్ వి సెట్ నందు చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్ ఓట్లు లెక్కింపు పై టేబుల్స్ సూపర్ వైజర్లు,అసిస్టెంట్లు సూపర్ వైజర్లు అధికారులు సిబ్బందికి నిర్వహించిన ఒక్క రోజు శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న ఎస్ వి సెట్ నందు చిత్తూరు పార్లమెంట్ నియోజకవర్గానికి సంబంధించి పోస్టల్ బ్యాలెట్స్ ఓట్లు లెక్కింపు ప్రక్రియ లో బాగంగా స్ట్రాంగ్ రూమ్స్,సీలింగ్ రూమ్స్ దగ్గర ఉన్న ఇంచార్జులు కౌంటింగ్ కేంద్రాలకు పంపించే ముందు కౌంటింగ్ అయినా తర్వాత సీలింగ్ రూమ్స్ లో భద్రపరిచే టప్పుడు తప్పని సరిగా రిజిస్టర్‌లో నమోదు చేసి సంబందితా వారి నుండి సంతకాలు తీసుకోవాలని స్ట్రాంగ్, సిల్లింగ్ రూమ్స్ ఇంచార్జ్ లను ఆదేశించారు. పోస్టల్ బ్యాలెట్స్ స్కనింగ్,13 సి, 13 బిసిఏఆర్‌ఓ కౌంటింగ్ టేబుల్స్ సూపర్ వైజర్లుజాగ్రత్తగా పరిశీలించా లని,ఏదైనా సందేహం ఉంటే ఆర్ ఓ దృష్టికితీసుకెళ్లాలన్నారు. ,పోస్టల్ బ్యాలెట్స్ లెక్కింపు కు 14 టేబుల్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుందని,పోస్టల్ బ్యాలెట్స్ 25 ఓట్లు చొప్పున కట్టలు కట్టాలని ప్రతి టేబుల్ కు 500 ఓట్లు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆదివారం మధ్యాహ్నం కల్లా పార్లమెంట్ కు సంబంధించి పోస్టల్ బ్యాలెట్స్ లెక్కింపు హాల్ నందు కంప్యూటర్లు,నెట్ కనెక్షన్లు, స్టేషనరీ సిద్ధంగా ఉండాలని సంబందిత అధికారులను ఆదేశించారు. ఆర్ ఓ లు,ఏ ఆర్ ఓ లు,సూపర్ వైజర్లు,అసిస్టెంట్లు సూపర్ వైజర్లు అధికా రులు సిబ్బంది అందరు జూన్ 3 న ఉదయం 11 గంటలకు ఎస్ వి సెట్ నందు హాజరు కావాలని, కౌంటింగ్‌కు విధులు కేటాయించిన అధికారులు సిబ్బంది ఐ డి కార్డులు తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు.జూన్ 4 నాడు ఎవ్వరు కూడా సెల్ ఫోన్స్ కౌంటింగ్ కేంద్రం లోనికి అనుమతిలేదుని,ఎస్ వి సెట్ గేట్ వద్ద సెల్ ఫోన్స్ కౌంటర్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు.ఎవ్వరికి కేటాయించిన విధులను చిన్న పొరపాట్లు జరగ కుండా జాగ్రత్తగా విధులు నిర్వహించాలని సంబంధిత అధికారులు సిబ్బందిని ఆదేశిం చారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు,నగరి ,పుంగనూరు అసెంబ్లీ నియోజకవర్గాల రిటర్నింగ్ అధికారులు జి.చిన్నయ్య,వెంకట రెడ్డి,మధుసూదన్ రెడ్డి,వ్యవసాయ శాఖ జెడి మురళి కృష్ణ,గృహనిర్మాణ సంస్థ పిడి.పద్మనాభం,బి సి కార్పొరేషన్ ఈ డి.శ్రీదేవి,సాంఘిక సంక్షేమ శాఖ డి డి.డాక్టర్ రాజ్యలక్ష్మి,పశుసంవర్ధక శాఖజెడి.ప్రభాకర్,ఎస్ సి కార్పొరేషన్ ఈ డి.నరసింహులు, కలెక్టరేట్ ఏ ఓ.వెంకటేశ్వరన్, అమరేంద్ర బాబు,రవి,రాజు పాల్గొన్నారు.

పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పక్కాగా చేపట్టాలి

- జాయింట్ కలెక్టర్ హెచ్ఎం ధ్యాన చంద్ర

విశాలాంధ్ర-తిరుపతి: ఎటువంటి పొరపాట్లకు తావు లేకుండా పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు పక్కాగా చేయాలని జాయింట్ కలెక్టరు హెచ్ ఎం ధ్యానచంద్ర సంబంధిత అధికారులను ఆదేశిం చారు. తిరుపతి కలెక్టరేట్ లో శనివారం ఏర్పాటు చేసిన మోడల్ కౌంటింగ్ కేంద్రంలో హాండ్స్ ఆన్ ట్రైనింగ్ ద్వారా అన్ని అసెంబ్లీ, పార్లమెంటు నియోజకవర్గాల ఏఆర్వోలు, అడిషనల్ ఏఆర్వోలకు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు పై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ... ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఆర్వోలు, అడిషనల్ ఆర్వోలు పోస్టల్ బ్యాలెట్ లెక్కింపు గురి ంచి హ్యాండ్ బుక్ ను క్షుణ్ణంగా చదివి అవగాహన చేసుకో వాలన్నారు. పోస్టల్ బ్యాలెట్ కౌంటింగ్ ఉదయం 8గంటలకు ప్రారంభమవుతుందన్నారు. పోస్టల్ బ్యాలెట్స్ 25 ఓట్లు చొప్పున కట్టలు కట్టాలని ప్రతి టేబుల్ కు 500 ఓట్లు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ ఓట్ల లెక్కింపు రౌండ్ వారీ ఫలితాలు మీడియా సెంటర్ కు అందజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తిరుపతి మున్సిపల్ కమిషనర్ అదితిసింగ్, తిరుపతి శ్రీకాళహస్తి, సూళ్లూరుపేట, గూడూరు రిటర్నింగ్ అధికారులు నిశాంత్ రెడ్డి, రవిశంకర్ రెడ్డి, చంద్రముని, కిరణ్ కుమార్, ట్రైనింగ్ నోడల్ అధికారి రామ్మోహన్ పోస్టల్ బ్యాలెట్ నోడల్ అధికారి సుశీల దేవి, నియోజకవర్గ ఆర్వోలు, అడిషనల్ ఆర్వోలు పాల్గొన్నారు.

సర్వ విద్యా ప్రదాత హనుమంతుడు

: శ్రీ సువిద్యేంద్ర తీర్థ స్వామి

హనుమజ్జయంతినాడు ఆకట్టుకున్న భక్తి సంగీత కార్యక్రమాలు

విశాలాంధ్ర - తిరుమల: హనుమంతుడు సర్వ విద్య ప్రదాత అని బెంగుళూరు రాఘవేంద్ర స్వామి మఠాధిపతి శ్రీశ్రీశ్రీ సువిద్యేంద్ర తీర్థ స్వామి పేర్కొన్నారు.హనుమజ్జయంతిని పురస్కరించుకుని శనివారం తిరుమలలోని నాదనీరాజనం, ఆకాశగంగ, జపాలి తీర్థంలో నిర్వ హించిన భక్తి సంగీత కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టు కున్నా యి.ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ సువిద్యేంద్ర తీర్థ స్వామిజీ అనుగ్రహ భాషణం చేస్తూ, వరమాతృడైన శ్రీమహావిష్ణువు సకల విద్యలను సూర్యుడికి బోధించాడని, సూర్యుడు సకల విద్యలను హనుమంతుడికి బోధించినట్లు తెలిపారు హనుమంతుని సేవిస్తే సత్ప్రవర్తన, ధైర్యం యశస్సు , విజయం సిద్ధిస్తుందని స్వామీజీ చెప్పారు. హనుమంతుడు తిరుమలలో జన్మించి, బాల్యంలోనే సూర్యుని పండుగ భావించి తినబో యిన దైరీ సాలి అన్నారు. రామ రావణ యుద్ధంలో సంజీవిని తెచ్చేం దుకు హనుమంతుడిని మాత్రమే శ్రీరాముడు పంపినట్లు తెలిపారు. అం దుకు కారణం స్వయంప్రకాశాలైన సంజీవినిని గుర్తించేందుకు తెచ్చేం దుకు సూర్య విద్య తెలిసి ఉండాలని అది ఒక హనుమంతుడికి మాత్రమే తెలుసునని వివరించారు.అనంతరం ఎస్వీ ఉన్నత వేదాధ్య యన సంస్థ ప్రత్యేక అధికారి డాక్టర్ విభీషణ శర్మ స్వామీజీని శాలువ శ్రీవారి ప్రసాదాలతో సత్కరించారు. ఆకాశ గంగలో.... ఆకాశగంగలోని శ్రీ బాలాంజనేయస్వామివారి ఆలయం వద్ద శనివారం ఉదయం 10 నుండి 11.30 గంటల వరకు జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయం అధ్యాపకులు ఆచార్య రాఘవా చార్యులు హనుమంతుని జన్మ విశేషాలు తెలిపారు.జపాలి క్షేత్రం లో....జాపాలి క్షేత్రంలో టిటిడి దాససాహిత్య ప్రాజెక్టు ప్రత్యేకాధికారి శ్రీ పి.ఆర్. ఆనంద తీర్థాచార్యులు ఆధ్వర్యంలో కళాకారులు ఉదయం 8 నుంచి 9.30 గంటల వరకు హనుమాన్ చాలీసా పఠించారు. ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు తిరుపతికి చెందిన శ్రీ సురేష్ భాగవతార్ హరికథ గానం చేశారు. ఉదయం ఎస్వీ సంగీత, నృత్య కళాశాల అధ్యాపకు రాలు శ్రీ సురేష్, శ్రీ సుధాకర్ బృందం ఉదయం 10.30 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు " రామ రామ జయ జయ రామ...., శ్రీరామదూత హను మంత....., మంగాంబుధి హను మంత...., రామ భక్తి సామ్రాజ్యం...." తదితర కీర్తనలను సుమధు రంగా ఆలపిం చారు.అనంతరం మధ్యాహ్నం 2 నుండి 3 గంటల వరకు తిరుపతికి చెందిన శ్రీ ప్రసన్న లక్ష్మీ బృందం హనుమాన్ చాలీసా పఠించారు. సాయంత్రం 4 నుండి 5 గంటల వరకు అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారిణి శ్రీమతి రమ్య క్రిష్ణ హరికథ గానంచేశారు.

స్విమ్స్ పాథాలజీ, సర్జికల్, మెడికల్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో

సి.యం.ఇ. విజయవంతం

విశాలాంధ్ర-తిరుపతి: శ్రీ వెంకటేశ్వర వైద్య విజ్ఞాన సంస్థ (స్విమ్స్) పాథాలజీ, సర్జికల్, మెడికల్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో 01.06.2024 వ తేది శనివారం మధ్యాహ్నం 2 గంటలకు, శ్రీ పద్మావతి ఆడిటోరియం నందు నిరంతర వైద్య విద్య కార్యక్రమం నిర్వహించినట్లు స్విమ్స్ మెడికల్ సూపరింటెండెంట్ డా.రామ్ గారు తెలియచేసారు.ఈ కార్యక్రమాన్ని స్విమ్స్ రిజిస్ట్రార్ డా. అపర్ణ ఆర్ బిట్ల, పాథాలజీ విభాగాదిపతి డా.రుక్మాంగద, సర్జికల్ ఆంకాలజీ విభాగాదిపతి డా.నరేంద్ర, రేడియేషన్ ఆంకాలజీ విభాగా దిపతి డాక్టర్. సుబ్ర మనియన్ డా.ప్రాణబందు దాస్ సంయుక్తంగా జ్యోతిని వెలిగించి కార్యక్రమంను ప్రారంభించారు.రేడియేషన్ ఆంకాలజీ డా.ప్రాణబందు దాస్ గారు మాట్లాడుతూ...థైరాయిడ్ క్యాన్సర్ నిర్వహణలో ప్రధాన క్లినికల్ ఛాలెంజ్ తక్కువ-రిస్క్ వ్యాధి ఉన్న రోగులలో అధిక-చికిత్స మరియు అధిక-నిర్ధారణను నివారించడం గురించి ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగిందని తెలిపారు.పాథాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.సుగుణ మాట్లాడుతూ. థైరాయిడ్ పాథాలజీ మరియు సైటోపాథాలజీ రంగం కీలక పరివర్తనలను సాధించింది. ఈ డైజెస్ట్ శుద్ధి చేయబడిన పదజాలాలు కొత్తగా ప్రవేశపెట్టిన వర్గాలు మరియు నవీకరించబడిన వర్గీకరణకు కీలకమైన వివాదాస్పద పద్ధతివరమైన పరిశీలనలను ఎలా తెరపైకి తెస్తుందని పవర్ పాయింట్ ప్రెజెంట్ ద్వారా వివరిం చారు.సర్జికల్ ఆంకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. వి.వినోదిని మాట్లాడుతూ...శస్త్రచికిత్సా దృక్కోణం నుండి శస్త్రచిక త్సకు ముందు ఆంకోలాజికల్ చికిత్స యొక్క అభివృద్ధి క్యాన్సర్ యొక్క శస్త్రచికిత్స చికిత్స ధోరణులపై అలాగే క్యాన్సర్ రోగుల ఫలితాలపై తీవ్ర ప్రభావం ఉంటుందని ఈ యొక్క అంశాలను పవర్ పాయింట్ ప్రెజెంట్ ద్వారా వివరించారు.న్యూక్లియర్ మెడిసిన్ విభాగం విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.ఆర్.రమ్య ప్రియ మాట్లాడుతూ.. న్యూక్లియర్ మెడిసిన్‌లో క్యాన్సర్ గుర్తింపులో ఇటీవలి పురోగతి గణనీయంగా మరియు ప్రోత్సాహకరంగా ఉంది. మూడు ప్రధాన పోకడలు బాధ్యత వహిస్తాయి. మొదట ఇమేజింగ్ యొక్క సాంకేతికతలు మెరుగు పడ్డాయి తరువాత కొత్త మరియు మెరుగైన ఇమేజింగ్ పరికరాల అభివృద్ధితో కలిసి ఉంటాయి. రెండవది కొత్త రేడియోఫార్మాస్యూ టికల్స్ పరిశోధించబడుతున్నాయని గురించి పవర్ పాయింట్ ప్రెజెంట్ ద్వారా వివరించారు.మెడికల్ ఆంకాలజీ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. యం.కె.అద్వైట్ గారు మాట్లాడుతూ.... క్యాన్సర్‌లకు చికిత్స చేయడానికి తాజా పద్ధతులను ఉపయోగిస్తున్నారు కీమోథెరపీ, ఇమ్యునోథెరపీ లేదా రోగి యొక్క పరిస్థితి ఆధారంగా టార్గెటెడ్ థెరపీ వంటివి. శస్త్రచికిత్స అవసరమైతే ఆమె ఉత్తమమైన ఫలితాన్ని నిర్ధారిం చడానికి శస్త్రచికిత్స ఆంకాలజిస్ట్‌లతో సహకరిస్తు ందని గురించి పవర్ పాయింట్ ప్రెజెంట్ ద్వారా వివరించారు.రేడియేషన్ ఆంకాలజీ అసిస్టెంట్ ప్రొఫెసర్ డా.జి.వి.దీప్తి గారు మాట్లాడుతూ.... రేడియేషన్ ఆంకాలజీ అనేది రేడియేషన్‌ను సూచించే వైద్య ప్రత్యేకత మరియు రేడియాలజీకి భిన్నంగా ఉంటుంది మెడికల్ ఇమేజింగ్ మరియు రోగ నిర్ధారణలో రేడియేషన్ వాడకం . రేడియేషన్‌ను నయం చేయాలనే ఉద్దేశ్యంతో లేదా సహాయక చికిత్స కోసం రేడియేషన్ ఆంకాలజిస్ట్ సూచించవచ్చు అని పవర్ పాయింట్ ప్రెజెంట్ ద్వారా వివరించారు. ఈ యొక్క కార్యక్రమ ఆర్గనైజర్ గా రేడియో థెరపీ విభాగపు అసో సియేట్ ప్రొఫెసర్ డా. బి.శ్రీనివాస రావ్ , ఆర్గనైజింగ్ చైర్ పర్సన్ గా రేడియేషన్ ఆంకాలజీ డా.ప్రాణబందు దాస్ వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో పాథాలజీ,సర్జికల్, మెడికల్ రేడియేషన్ ఆంకాలజీ విభాగాల వైద్యులు, విద్యార్థిని విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.